ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా, నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

# vaartha sandhya వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 139 గురువారం 07 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజిలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 139 Thursday 07 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## తమిళనాడులో విజయ్ పార్టీకి కాంగ్రెస్ జై.. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు



తమిళనాడులో విజయ్ పార్టీకి మద్దతు ప్రకటించిన కాంగ్రెస్

టీవీకేకు 108 సీట్లు రాగా, మెజార్టీకి మరో 10 సీట్లు అవసరం

లౌకిక, స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకే తమ మద్దతన్న కార్తీ చిదంబరం

తమకు మద్దతు ఇవ్వాలని టీవీకే అధికారికంగా లేఖ రాసిందని వెల్లడి

వార్త సంధ్య న్యూస్, ఢిల్లీ, మే 06 :

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి మద్దతిచ్చి, ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా నిర్ణయించింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం బుధవారం ధ్రువీకరించారు. తమిళనాడు ప్రజలు లౌకిక మార్పును కోరుకున్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. - మిగతా 2 లో

## శబరిమల సెగ.. కేరళలో ఆ ఇద్దరు మంత్రుల ఓటమికి 'దేవస్వం' కారణమైందా?



- కేరళ ఎన్నికల్లో ఇద్దరు దేవస్వం శాఖ మంత్రుల ఓటమి
- విజయన్ ప్రభుత్వంలో పనిచేసిన కడకంపల్లి సురేంద్రన్, వీఎన్ వాసవన్ పరాజయం
- శబరిమల బంగారు కుంభకోణం ఆరోపణలను ప్రచారాస్త్రంగా వాడిన విపక్షాలు
- లెఫ్ట్ ఫ్రంట్ ఓటమిలో అయ్యప్ప ఆలయ వివాదం పాత్రపై రాజకీయ వర్గాల్లో చర్చ
- ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు శబరిమల అంశం కూడా ప్రభావం చూపిందన్న విశ్లేషణలు

వార్త సంధ్య న్యూస్, ఢిల్లీ, మే 06 :

కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగలగా, ఇప్పుడు కీలకమైన ప్రశ్న రాజకీయ వర్గాలను తొలిచేస్తోంది. పినరయి విజయన్ ప్రభుత్వంలో రెండు దఫాలుగా దేవస్వం (దేవదాయ) శాఖను పర్యవేక్షించిన ఇద్దరు సీనియర్ మంత్రుల ఓటమికి శబరిమల వివాదానికి ఏమైనా సంబంధం ఉందా? అయ్యప్ప ఆలయ వ్యవహారాలు, దాని చుట్టూ అల్లుకున్న ఆరోపణలు వారి పరాజయాన్ని శాసించాయా..? - మిగతా 2 లో

## తొలి ఎన్నికల్లోనే టీవీకే సంచలనం... ఇద్దరు బ్రాహ్మణ అభ్యర్థులతో విజయ్ వ్యూహం సక్సెస్

- తొలి అసెంబ్లీ ఎన్నికల్లోనే సత్తా చాటిన టీవీకే
- ఇద్దరు బ్రాహ్మణ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకున్న విజయ్ పార్టీ
- ఆరుగురు బ్రాహ్మణ అభ్యర్థులను నిలబెట్టిన సీమాన్ పార్టీ ప్రయోగం విఫలం



వార్త సంధ్య, చెన్నై, మే 06 :

తమిళనాడు రాజకీయాల్లో నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) తన తొలి అసెంబ్లీ ఎన్నికల్లోనే సంచలనం సృష్టించింది. ప్రధాన ద్రవిడ పార్టీలన్నీ దూరంగా పెట్టిన ఒక సాహ సోపేతమైన ప్రయోగానికి టీవీకే శ్రీకారం చుట్టిం ది. ఇద్దరు బ్రాహ్మణ అభ్యర్థులను బరిలోకి దింపి ఆ పార్టీ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఫలిం చింది. - మిగతా 2 లో

## అలా చేస్తే కేసులు వాపస్ : మంగ్లీకి న్యాయవాది సుబ్బారావు కీలక సూచన

- బాధితులకు డబ్బులు చెల్లిస్తే కేసులు వాపస్ తీసుకుంటామన్న న్యాయవాది
- కానీ ఈ కేసులో ఆమె తప్పిం చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం
- మంగ్లీ, ఆమె సోదరుడిపై వివిధ పోలీస్ స్టేషన్‌లలో కేసులు మోదయ్యాయని వెల్లడి
- వీటికి వారు ఏం సమాధానం చెబుతారని ప్రశ్న



వార్త సంధ్య, హైదరాబాద్, మే 06 :

మైక్రోఫైనాన్స్ కేసులో గాయని మంగ్లీపై న్యాయవాది సుబ్బారావు కీలక సూచన చేశారు. ఈ కేసులోని బాధితులకు మంగ్లీ, ఆమె సోదరుడు డబ్బులు చెల్లిస్తే కేసులు వాపస్ తీసుకోవడానికి తాము సిద్ధమని స్పష్టం చేశారు. - మిగతా 2 లో

# కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై సమగ్రంగా పూర్తి వివరాలు సమర్పించండి

### భూసేకరణ, జరిగిన పని, చేయాల్సిన పని ఇలా అన్ని వివరాలు

- ఈ పనుల్లో 60 నుంచి 70 శాతం వరకు ఇప్పటికే పూర్తయ్యాయి.
- పనుల పూర్తికి ఆటంకంగా ఉన్న అన్ని రకాల సమస్యలు నివేదికలో ఉండాలని స్పష్టం సీఎం
- ప్యాకేజీల వారీగా వివరాలు అందజేయాలని సీఎం సూచించినట్లు సమాచారం
- చెరువుల కెపాసిటీని పెంచి నీటిని సప్లై చేయడం తదితర ప్రతిపాదనలపై సమీక్షలో చర్చ
- మల్లన్నసాగర్ నుంచి లక్ష్యం మేరకు నీటిని ఇవ్వడం ఏ మాత్రం వీలుకాదు





వార్త సంధ్య, హైదరాబాద్, మే 06 :

అక్కడో పని ఇక్కడో పని చేపట్టడం కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టులో చేపట్టిన అన్ని ప్యాకేజీల వివరాలను సమగ్రంగా తయారు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అదనపు టీఎంసీ పనులతో సహా అన్నింటిలోనూ భూసేకరణ, జరిగిన పని, చేయాల్సిన పని ఇలా అన్ని వివరాలు ఉండాలని సూచించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా - మిగతా 2 లో

## రఘురాం రాజన్‌తో రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్..

### తెలంగాణ అభివృద్ధికి కీలక సూచనలు



- మాజీ ఆర్‌బీఐ గవర్నర్ రఘురాం రాజన్‌తో సీఎం రేవంత్ భేటీ
- రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై కీలక చర్చ
- విద్యావ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై ప్రధానంగా దృష్టి
- నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లను ప్రోత్సహించాలని రాజన్ సూచన


వార్త సంధ్య, హైదరాబాద్, మే 06 :

తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ రఘురాం రాజన్‌తో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. నిన్న జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. - మిగతా 2 లో

## ఆర్‌టిఇ చట్టం నీరుగార్చుతున్న ప్రైవేట్ స్కూళ్లు 25% సీట్లు కాగితాలకే పరిమితం




- పేదలకు నాణ్యమైన విద్య లక్ష్యం దెబ్బతింటోంది
- అడ్మిషన్లలో పారదర్శకత లేకపోవడం పై విమర్శలు
- "సీట్లు లేవు" అంటూ తల్లిదండ్రుల తిరస్కరణ
- అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు




4 లో

హైదరాబాద్, మే 6 (వార్త సంధ్య):

: పేద మరియు బలహీన వర్గాల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో అమలులోకి వచ్చిన విద్యా హక్కు చట్టం ఆర్‌టిఇ ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో తన అసలు లక్ష్యాన్ని కోల్పోతున్నదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ అన్-ఎయిడెడ్ స్కూల్‌లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉన్నప్పటికీ.. - మిగతా 4 లో

## 'యాక్ట్ ఈస్ట్' విధానంలో వియత్నాం కీలక దేశం : మోదీ



వార్త సంధ్య న్యూస్, ఢిల్లీ, మే 06 :

ద్వైపాక్షిక సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేర్చాలని భారత్, వియత్నాం నిర్ణయిం చాయి. ఆర్థిక, రక్షణ సహకారాన్ని మరింత విస్తరించాలని నిశ్చ యిం చాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం - మిగతా 2 లో

## రైతు సంగ్రామ సదస్సులో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేటీఆర్

- వరంగల్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ రైతు సంగ్రామ సదస్సు
- కాంగ్రెస్ ప్రకటించిన రైతు డిక్లరేషన్ ఒక నయవంచన అని వెల్లడి
- రైతుల సంక్షేమం కోసం రేవంత్ ఢిల్లీ నుంచి ఒక్క పైసా కూడా తీసుకురాలేదని విమర్శ



వార్త సంధ్య, హైదరాబాద్, మే 06 :

వరంగల్ వేదికగా జరిగిన 'రైతు సంగ్రామ సదస్సు'లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. వరంగల్ జిల్లా కాకతీయ పౌరుషాల గడ్డ అని కొని యాడిన కేటీఆర్, ఇక్కడి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. - మిగతా 2 లో

## రాజకీయ నాయకులకు డబుల్ ఫైన్.. హోంమంత్రి అనిత కీలక ఆదేశాలు



2లో

- హెల్మెట్ లేని నేతలకు రెట్టింపు జరిమానా విధించాలని మంత్రి ఆదేశం
- అనకాపల్లి జిల్లాలో రోడ్డు భద్రత బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి అనిత
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరికీ మినహాయింపు లేదని స్పష్టీకరణ
- హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ప్రజలకు పిలుపు
- నియోజకవర్గంలో రోడ్డు ప్రమాద మరణాలపై ఆవేదన వ్యక్తం చేసిన అనిత

# రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు

### రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు - 39 వేల ఉద్యోగాలు - ఎస్ఐపీబీ కీలక నిర్ణయాలివే..

- సీఎం అధ్యక్షతన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం
- రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు 17వ ఎస్ఐపీబీ ఆమోదం
- రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం, 39 వేల మందికి ఉద్యోగాలు
- గ్యాస్ పైప్‌లైన్ వంటి మౌలిక వసతుల విస్తరణపై కూడా దృష్టి పెట్టాలి
- అనుమతుల జారీ విషయంలో ఒక్కరోజు కూడా ఆలస్యం ఉండకూడదు
- కుదుర్చుకున్న ప్రతీ ఒప్పందం పెట్టుబడిగా రూపాంతరం చెందాలి



వార్త సంధ్య, అమరావతి,మే 06 :

రాష్ట్రాన్ని పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా మరో భారీ అడుగు పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 17వ ఎస్ఐపీబీ సమా వేశంలో రూ.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు ఆమోదం తెలపగా, వీటి ద్వారా దాదాపు 39 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్క నున్నాయి. విశాఖలో రిలయన్స్ డేటా సెంటర్‌కు గ్రీన్ సిగ్నల్‌తో పాటు శక్తి, పరిశ్రమలు, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో విస్తృత ప్రాజెక్టులు ముం దుకు వచ్చాయి. అనుమతుల నుంచి ప్రారంభోత్సవం వరకు ప్రతి దశలో వేగం, పారదర్శకతతో ఏపీకి ప్రత్యేక బ్రాండ్ తీసుకురావాలని - మిగతా 2 లో




## ఏపీకి రూ.1000 కోట్ల పెట్టుబడి.. క్యారియర్ ఏసీ పరిశ్రమకు మంత్రి లోకేశ్ శంకుస్థాపన

- శ్రీసిటీలో క్యారియర్ ఏసీల తయారీ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి
- రూ.1000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు.. 3000 మందికి ఉపాధి అవకాశాలు
- సీఎం చంద్రబాబు తన గదిని 17లోజ వద్ద ఉంచుతారని లోకేశ్ సరదా వ్యాఖ్య
- డేటా సెంటర్లను ఆకర్షించడమే కాదు, వాటి తయారీ వ్యవస్థనే నిర్మిస్తున్నామన్న లోకేశ్
- డేటా సెంటర్ల రంగంలో ఏపీ అగ్రగామిగా నిలుస్తుందని ధీమా

వార్త సంధ్య, అమరావతి,మే 06 :

ఏపీని పారిశ్రామికంగా, సాంకేతికంగా అగ్రస్థానంలో నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ప్రపంచ ప్రసిద్ధ ఎయిర్ కండిషనర్ల తయారీ సంస్థ 'క్యారియర్ గ్లోబల్' యూనిట్‌కు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కోసం క్యారియర్ సంస్థ సుమారు రూ. 1,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 3,000 మందికి ఉపాధి, జీవనోపాధి అవకాశాలు లభించనున్నాయి. - మిగతా 2 లో

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



## 2028 నాటికి 80% ఏసీలు ఏపీలోనే..

## దేశానికి 'కూల్ క్యాపిటల్'గా ఆంధ్రప్రదేశ్: మంత్రి లోకేశ్

ఏపీని దేశంలోనే కీలక పారిశ్రామిక హబ్‌గా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని, త్వరలోనే రాష్ట్రాన్ని 'భారతదేశపు కూల్ క్యాపిటల్'గా తీర్చిదిద్దుతామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీసిటీలో ప్రముఖ ఏసీ తయారీ సంస్థ 'క్యారియర్' యూనిట్ ఏర్పాటుకు జరిగిన భూమి పూజ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, 2028 నాటికి భారత దేశానికి అవసరమైన 80 శాతం ఎయిర్ కండిషనర్లను (ఏసీ) ఏపీలోనే తయారు చేసే స్థాయికి ఎదుగుతామని ధీమా వ్యక్తం చేశారు. శ్రీసిటీ సాధించిన ప్రగతిని వివరిస్తూ... "సుమారు 8,500 ఎకరాల్లో విస్తరించి ఉన్న శ్రీసిటీలో 31 దేశాలకు చెందిన 250 కంపెనీలు తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇక్కడి నుంచి ఏటా 6 బిలియన్ డాలర్లకు పైగా విలువైన ఎగుమతులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 70,000 ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. అందులో 50 శాతం ఉద్యోగాలు మహిళలకు దక్కడం ఎంతో సంతోషాన్నిచ్చే విషయం" అని లోకేశ్ తెలిపారు. ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ వరకు విభిన్న రంగాల్లో శ్రీసిటీ 'మేక్ ఇన్ ఇండియా', 'మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్'కు ప్రతీకగా నిలుస్తోందని, క్యారియర్ రాకతో ఈ ప్రగతి ప్రస్థానంలో మరో మైలురాయి చేరిందని ఆయన పేర్కొన్నారు. ఏపీని ఏసీ తయారీ రంగంలో అగ్రగామిగా నిలబెట్టే లక్ష్యంపై మాట్లాడుతూ.. "ఇప్పటికే 9 ప్రముఖ ఏసీ తయారీ కంపెనీలు, 30కి పైగా అనుబంధ పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. ఈ ఎకోసిస్టమ్‌లో సుమారు రూ. 12,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2027 నాటికి దేశంలోని 60% ఏసీలను ఇక్కడే తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పుడు క్యారియర్ రాకతో 2028 నాటికి 80% లక్ష్యాన్ని చేరుకుంటాం" అని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి క్లస్టర్ ఆధారిత వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు మంత్రి వివరించారు. "భవిష్యత్తు మొత్తం ఎకోసిస్టమ్స్, క్లస్టర్లదే. ఒక ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకులు, పరికరాల నుంచి పూర్తిస్థాయి తయారీ వరకు ఒకేచోట ఉండేలా వర్టికల్ ఇంటిగ్రేషన్‌తో పాటు, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ వంటి అంశాలతో హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌పైనా దృష్టి సారించాం" అని అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఏసీ క్లస్టర్, గ్లాస్ క్లస్టర్, స్పేస్ సిటీ, పునరుత్పాదక ఇంధన క్లస్టర్, డేటా సెంటర్ క్లస్టర్ వంటివి వీటిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న మరో కీలక నిర్ణయాన్ని లోకేశ్ ప్రకటించారు. "యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు 'నైపుణ్యం' పేరుతో ఒక సంభాషణ ఆధారిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్ అసెస్‌మెంట్ పోర్టల్‌ను ఈ మే నెలాఖరులోగా ప్రారంభిస్తున్నాం" అని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో భాగ స్వాములు కావాలని ఆయన పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.

## రైతు సంగ్రామ సదస్సులో

## కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేటీఆర్



**మొదటిపేజీ తరువాయి -** నాలుగేళ్ల క్రితం వరంగల్‌లో కాంగ్రెస్ ప్రకటించిన 'రైతు డిక్లరేషన్' ఒక నయవంచన అని, అది కేవలం ఓట్ల కోసమే చేసిన 'కొంగజపం' అని ఆయన మండిపడ్డారు. డిక్లరేషన్‌లో ఇచ్చిన 34 హామీలను గాలికొదిలేశారని, వంద రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా అతీగతీ లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓట్లు వేసిన రైతులు నేడు అరిగోస పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్‌ను ఒక బోగస్ చిత్తు కాగితంగా అభివర్ణించిన కేటీఆర్... ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు మేళాలను 'దగా మేళాలు'గా సంబోధించారు. కేసీఆర్ హయాంలో ఎకరాకు రూ. 10 వేలు అందిస్తే, రూ. 15 వేలు ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్.. నేడు కనీసం ఉన్న సౌకర్యాలను కూడా అందించలేకపోతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికి 69 సార్లు ఢిల్లీకి వెళ్లారని, కానీ రాష్ట్ర రైతు ప్రయోజనాల కోసం ఒక్క పైసా కూడా తీసుకురాలేదని ఆక్షేపించారు. రైతుల సహనాన్ని పరీక్షించవద్దని, వడ్ల కొనుగోళ్లలో జాప్యం జరిగితే కాంగ్రెస్ నేతలను గ్రామాల్లో రైతులు తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

## తమిళనాడులో విజయ్ పార్టీకి

## కాంగ్రెస్ జై.. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు

**మొదటిపేజీ తరువాయి -** ఏఎన్ఐ వార్తా సంస్థతో కార్తీ చిదంబరం మాట్లాడుతూ... "టీవీకే నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతివ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. టీవీకే 108 స్థానాలు గెలుచుకుంది. తమిళనాడు ప్రజలు ఆ పార్టీ నాయకత్వంలోనే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. మెజార్టీకి అవసరమైన సంఖ్యాబలాన్ని సమకూర్చుకోవడానికి టీవీకే అధికారికంగా కాంగ్రెస్ పార్టీని సంప్రదించింది. దీనిపై మా పార్టీలోని అన్ని వేదికల్లో చర్చించి, ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని తీర్మానించాం. ప్రజలు కేవలం మార్పునే కాదు, లౌకిక ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. అందుకే తమిళనాడులో ఒక స్థిరమైన, లౌకిక ప్రభుత్వం ఏర్పడటానికి మేము సహాయం చేస్తున్నాము" అని వివరించారు. అంతకుముందు టీవీకే, కాంగ్రెస్ మధ్య పొత్తుపై ఊహాగానాలు రాగా, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి గిరీష్ చోడంకర్ దీనిపై స్పష్టతనిచ్చారు. మద్దతు కోరుతూ టీవీకే తమ పార్టీకి లేఖ రాసిందని, దానిపై ఢిల్లీలోని అధిష్ఠానం చర్చించిందని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేతలు, నూతన ఎమ్మెల్యేలతో కలిసి నిర్వహించే మీడియా సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన చెప్పారు. "మా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు టీవీకే లేఖ ఇచ్చింది. దీనిపై నిన్న ఢిల్లీలో చర్చ జరిగింది. తదుపరి కార్యాచరణను ఉదయం 11 గంటలకు సత్యమూర్తి భవన్‌లో తెలియజేస్తాం" అని చోడంకర్ పేర్కొన్నారు. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. టీవీకే 108 స్థానాల్లో గెలుపొంది మెజార్టీకి 10 సీట్ల దూరంలో నిలిచింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ మద్దతుతో పాటు లెఫ్ట్ ఫ్రంట్ వంటి ఇతర చిన్న పార్టీలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు టీవీకే సిద్ధమవుతోంది.

### శబరిమల సెగ..

### కేరళలో ఆ ఇద్దరు మంత్రుల ఓటమికి 'దేవస్వం' కారణమైందా?



**మొదటిపేజీ తరువాయి –** అనే దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో సీపీఐ(ఎం) సీనియర్ నేతలు, మంత్రులుగా పనిచేసిన కడకంపల్లి సురేంద్రన్, వీఎన్ వాసవన్ అనూహ్యంగా ఓటమి పాలయ్యారు. 2016-21 మధ్య లెఫ్ట్ ప్రభుత్వంలో దేవస్వం మంత్రిగా పనిచేసిన సురేంద్రన్, కాజకూటం నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయంపై కన్నేశారు. అయితే, బీజేపీ సీనియర్ నేత వి. మురళీధరన్ చేతిలో ఆయన ఓడిపోయారు. అలాగే, 2021-26 మధ్య దేవస్వం శాఖను చూసిన వాసవన్, తన సొంత నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నాటకం సురేశ్ చేతిలో పరాజయం చవిచూశారు. ఈ ఓటముల వెనుక ప్రభుత్వ వ్యతిరేకత, స్థానిక సమీకరణాలు ఉన్నప్పటికీ, శబరిమల అంశం ప్రచారంలో ప్రధానంగా నిలిచింది. ముఖ్యంగా 'శబరిమల బంగారు కుంభకోణం' ఆరోపణలను కాంగ్రెస్, బీజేపీలు తమ ప్రచారాస్త్రంగా మార్చుకున్నాయి. ఈ ఇద్దరు మంత్రులనే కాకుండా మొత్తం లెఫ్ట్ ప్రభుత్వంపైనే విమర్శలు ఎక్కుపెట్టాయి. ఆలయ వ్యవహారాల నిర్వహణలో ప్రభుత్వ వైఖరిపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మలచుకోవడంలో విపక్షాలు సఫల మయ్యాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కేరళలో శబరిమల కేవలం ఒక పుణ్యక్షేత్రం కాదు, అదొక సున్నితమైన భావోద్వేగ, రాజకీయ అంశం. అయ్యప్ప ఆలయానికి సంబంధించిన ఏ చిన్న వివాదమైనా రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ ఎన్నికల్లో ఆ నమ్మకాన్ని, సెంటిమెంట్‌ను విపక్షాలు బలంగా ఉపయోగించుకున్నాయి. దేవస్వం శాఖతో ప్రత్యక్ష సంబంధం ఉన్న ఇద్దరు మంత్రులు ఒకేసారి ఓడిపోవడం యాదృచ్ఛికమా? లేక శబరిమల వివాదాల ప్రభావమా? అనేదానికి స్పష్టమైన సమాధానం చెప్పలేకపోయినా, ఈ పరిణామం లెఫ్ట్ ఫ్రంట్‌కు ఇబ్బందికర ప్రశ్నలను మిగిల్చింది. విశ్వాసం, పాలన ముడిపడి ఉన్న కేరళ రాజకీయాల్లో నమ్మకాలకు సంబంధించిన అంశాలు ఎన్నికల ఫలితాలను ఎంతగా ప్రభావితం చేస్తాయో ఈ తీర్పు స్పష్టం చేస్తోంది.

# కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై సమగ్రంగా పూర్తి వివరాలు సమర్పించండి

**మొదటిపేజీ తరువాయి -** శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ నుంచి ఉమ్మడి నిజామాబాద్‌కు నీటిని మళ్లించే 21, 22 ప్యాకేజీల పనుల గురించి ఇటీవల సీఎం సమీక్షించారు. మాసాని, మంచిప్ప చెరువుల సామర్థ్యం పెంచడానికి గతంలో ఇచ్చిన ఉత్తర్వులు, మళ్లీ రద్దు చేయడం, కొత్తగా ఐదు టీఎంసీలతో చెరువుల కెపాసిటీని పెంచి నీటిని సప్లై చేయడం తదితర ప్రతిపాదనలపై సమీక్షలో చర్చకు వచ్చాయి. 0.2 టీఎంసీ సామర్థ్యం గల చెరువు నుంచి ఐదు టీఎంసీల నీటిని ఎలా ఇవ్వగలరని, పనులు చేపట్టడం, తర్వాత సమస్యలు రావడం కాకుండా అన్ని అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మల్లన్నసాగర్ వరకు చేపట్టిన అదనపు టీఎంసీ పనులు కూడా ఆగిపోయాయి.

ఈ పనులు పూర్తయితే గానీ మల్లన్నసాగర్ నుంచి లక్ష్యం మేరకు నీటిని ఇవ్వడం ఏ మాత్రం వీలుకాదు. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్ తాగునీటికి, మూసీ పునరుజ్జీవనానికి 20 టీఎంసీల వినియోగంతో పనులను చేపట్టారు. ఈ పనులు ప్రారంభమై వేగంగా జరుగుతున్నాయి. రెండేళ్లలో వీటిని పూర్తి చేయాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకొంది. ఈ నీటి మళ్లింపు పథకం పూర్తయి ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్‌కు అదనపు టీఎంసీ నీటిని మళ్లించే పనులు పూర్తికాకుంటే సమస్య ఉత్పన్నం కావడం తథ్యం. ఈ పనుల్లో 60 నుంచి 70 శాతం వరకు ఇప్పటికే పూర్తయ్యాయి. సర్జ్‌పూల్‌లు, పంపుహౌస్‌లు, డెలివరీ సిస్టర్న్ లాంటి పనులు 80 నుంచి 90 శాతం జరగగా మరో రూ.13 వేల కోట్లు ఖర్చు చేస్తే మొత్తం పనులు పూర్తవుతాయని అధికారులు నివేదికలు సమర్పించారు. ప్యాకేజీల వారీగా వివరాలు అందజేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. చేయాల్సిన పని, ఇప్పటివరకు జరిగిన పని, భూసేకరణ ఇంకా ఎంత చేయాలి

పెండింగ్ బిల్లుల మొత్తం ఎంత ఉన్నాయి, ప్రస్తుతం పనులు పూర్తి చేయాలంటే వాస్తవంగా ఎంత బడ్జెట్ అవసరం ఇలా అన్ని వివరాలను సమగ్రంగా వారం రోజుల్లో అందజేయాలని ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పనుల పూర్తికి ఆటంకంగా ఉన్న అన్ని రకాల సమస్యలు నివేదికలో ఉండాలని స్పష్టం సీఎం చేసినట్లు తెలిసింది. దీంతో పాటు మల్లన్నసాగర్ దిగువన ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే పనులు, కాలువల పనులు, రిజర్వాయర్ల నిర్మాణం ఇలా అన్ని వివరాలను అందజేయాలని సూచించడంతో ఈ వివరాల తయారీలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు.

ఆదిలాబాద్ జిల్లాలోని తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు ప్రాణహిత నది నీటిని మళ్లించే పథకం గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీటిపారుదల శాఖ అధికారులు మరోసారి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మాణ స్థలం, పూర్తి స్థాయి నీటిమట్టం 150 మీటర్లు లేదా 149 మీటర్లు ఇలా పలు అంశాలపై సోమవారం క్యాబినెట్ సమావేశానికి ముందుగా కన్సల్టెన్సీ సంస్థ, నీటిపారుదల శాఖ అధికారులతో చర్చ జరగ్గా, నిర్మాణ స్థలాన్ని పరిశీలించారా? అని సీఎం ప్రశ్నించినట్లు విశ్వసనీయ సమాచారం. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించకుండా చెప్పొద్దని, గాలిలో మేడలు కట్టొద్దని, గత అనుభవాలను చూసి కూడా మళ్లీ అలాగే వ్యవహరిస్తే ఎలా అని కొంతమంది అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తుది నిర్ణయం తీసుకొని ఇప్పుడు పని ప్రారంభించగలమా? అని ప్రశ్నించగా పర్యావరణ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు ఆయనకు తెలిపారు. ఇప్పటివరకు ఏం చేశారని, పని ప్రారంభించడానికి ముందు అవసరమైన ప్రక్రియ పూర్తి చేయకుంటే పనుల్లో తీవ్ర జాప్యం జరిగి రాష్ట్ర ఆర్థికంపై భారం పడుతుందని, ఈ పరిస్థితిని రానీయొద్దని స్పష్టం చేసినట్లు తెలిసింది.

# రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు

**మొదటిపేజీ తరువాయి -** ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో 25 ప్రాజెక్టులకు సంబంధించిన భారీ పెట్టుబడులకు కీలక నిర్ణయాలు తీసుకుంది. విశాఖలో రిలయన్స్ సంస్థ రూ.1,08,010 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్‌ను, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను కూడా రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనుంది. కడపలో రూ.12 వేల కోట్లతో అదానీ హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును, తిరుపతిలో రూ.2,500 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ప్రతిపాదనలు ఒప్పం దాలుగా, ఒప్పందాలు నేలమీద పెట్టుబడులుగా మారాల్సిందేనని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

అను మతుల జారీ విషయంలో ఒక్కరోజు కూడా ఆలస్యం ఉండకూడదని, పరిశ్రమలు త్వరితగతిన స్థాపన దశకు చేరుకునేలా సమన్వయం అవ సరమని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈలకు సమాన ప్రాధాన్యం ఇవ్వడం, "వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్" లక్ష్యాన్ని సాధిం చడంలో వాటి పాత్ర కీలకమని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తు లకు విలువ జోడింపు, గ్యాస్ పైప్‌లైన్ వంటి మౌలిక వసతుల విస్తరణపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టు బడులకు సంబంధించి వచ్చిన ప్రతీ ప్రతిపాదనా ఒప్పందంగా మారా లని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కుదుర్చుకున్న ప్రతీ ఒప్పందం పెట్టుబడిగా రూపాంతరం చెందాలన్నారు. ఒక పెట్టుబడి, పరిశ్రమ రాష్ట్రానికి వచ్చే విషయంలో అనుమతుల నుంచి శంకు స్థాపన, ప్రారంభోత్సవం వరకు నిర్దేశిత గడువులోగా జరిగేలా చూడాలన్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీల శంకుస్థాపన నుంచి ఉత్పత్తి వరకూ నిర్దిష్టమైన కాలపరిమితిలో జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. నంద్యాలలో క్లీన్ రెన్యూబుల్ ఎనర్జీ హైబ్రిడ్ త్రీ రూ.155 కోట్లతో 40 ఉద్యోగాలు, అనంతపురంలో క్లీన్ ఎనర్జీ హైబ్రిడ్ ట్వెల్వ్, థర్టీన్ సంస్థలు చెరో రూ.779 కోట్లతో 125 ఉద్యోగాలు కల్పించనున్నాయి. కడపలో అదానీ హైడ్రో ఎనర్జీ ఎలెవన్ రూ.12,297 కోట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌తో 3375 మందికి ఉపాధి, తిరుపతిలో యమాన్కో గ్రీన్ హైడ్రోజన్ రూ.9398 కోట్లతో 5820 ఉద్యోగాలు అందిస్తుంది. విజయనగరంలో అమృత శ్రీ బయో సీఎన్‌జీ రూ.89 కోట్లతో 402 ఉద్యోగాలు, నెల్లూరులో బాలాజీ బయోఎనర్జీ రూ.59 కోట్లతో 335 ఉద్యోగాలు, ఏలూరులో హెచ్‌పీసీఎల్ గ్రీన్ ఎనర్జీ రూ.100 కోట్లతో 150 ఉద్యోగాలు, తిరుపతిలో ఎనర్జియా బయోఫ్యూయల్స్ రూ.59 కోట్లతో 335 ఉద్యోగాలు, తూర్పుగోదావరిలో విభా బయోఫ్యూయల్స్ రూ.67 కోట్లతో 110 ఉద్యోగాలు, ఎన్టీఆర్ జిల్లాలో ఐఓసీ జీపీఎస్ రూ.120 కోట్లతో 200 ఉద్యోగాలు, పలనాడులో డెల్టా బయోగ్యాస్ రూ.100 కోట్లతో 750 ఉద్యోగాలు కల్పించనున్నాయి. ప్రభుత్వ పరంగా ఇవ్వాల్సిన అనుమతుల విషయంలో ఒక్క రోజు కూడా జాప్యం జరగకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అనుమతుల జారీ విషయంలో ఏపీ బ్రాండ్ సృష్టించాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పెట్టుబడులను ఆకర్షించాలంటే ఇతరుల కంటే మనం ఎలా భిన్నమో ఏపీలో అనుమతులు ఎంత సులభతరమన్నది చాటి చెప్పాలని దిశానిర్దేశం చేశారు. ఏపీలో ప్రాజెక్టులు రావాలన్న తపన ఉన్న అధికారులను అనుమతులు ఇచ్చే స్థానాల్లో నియమించాలని సూచించారు. ఐటీ, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లోనూ కీలక పెట్టుబడులకు ఆమోదం లభించింది. తిరుపతిలో క్యారియర్ ఎయిర్ కండిషనింగ్ రూ.863 కోట్లతో 721 ఉద్యోగాలు, అమరావతిలో ఎన్ఎస్టీఎల్ క్వాంటం వ్యాలీ రూ.22.5 కోట్లతో 20 ఉద్యోగాలు కల్పించనున్నాయి. అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో స్నేహ ఫార్మ్స్ రూ.277.94 కోట్లతో 435 ఉద్యోగాలు, కర్నూలులో గ్రిడోన్ ఎనర్జీ రూ.3149 కోట్లతో 320 ఉద్యోగాలు, శ్రీసిటీలో అపోలో టైర్స్ రూ.6100 కోట్లతో 1000 ఉద్యోగాలు, నెల్లూరులో ఇఫ్కో సెజ్‌లో ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్ రూ.3153 కోట్లతో 172 ఉద్యోగాలు, తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ రూ.2508 కోట్లతో 3 వేల ఉద్యోగాలు సృష్టించనున్నాయి. పల్నాడులో చెట్టినాడ్ సిమెంట్స్ రూ.1340 కోట్లతో 360 ఉద్యోగాలు, కాకినాడలో ఏఏకె సౌత్ ఈస్ట్ ఇండియా రూ.171.52 కోట్లతో 102 ఉద్యోగాలు, గుంటూరులో ఐటీసీ రూ.51.65 కోట్లతో 50 ఉద్యోగాలు, తిరుపతిలో హ్యాంగ్యో ఐస్‌క్రీమ్స్ రూ.74.49 కోట్లతో 110 ఉద్యోగాలు కల్పించనున్నాయి. ఈ సమగ్ర పెట్టుబడులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు తీసుకురానున్నాయి. పెట్టుబడుల విషయంలో భారీ పరిశ్రమలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో, ఎంఎస్ఎంఈలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్ విషయంలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అన్ని పారిశ్రామిక ప్రాంతాలకు గ్యాస్ పైప్ లైన్ అందుబాటులో ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించాలని చంద్రబాబు సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని పెట్టుబడులు గ్రౌండ్ అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యాన, వాణిజ్య పంట ఉత్పత్తులకు విలువ జోడింపు జరగాలన్నారు. ఆయిల్ పాం, మామిడి, కొబ్బరి, కోకో సహా పలు పంటలకు వ్యాల్యూ అడిషన్ ఇస్తే రైతులకు ఎంతో మంచి జరుగుతుందని సీఎం చంద్రబాబు వివరించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, మంత్రులు టీజీ భరత్, అచ్చెన్నాయుడు, సుభాష్, వివిధ శాఖల అధికారులు, వర్చువల్‌గా మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

### రాజకీయ నాయకులకు డబుల్ ఫైన్.. హోంమంత్రి అనిత కీలక ఆదేశాలు

**మొదటిపేజీ తరువాయి -** ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ట్రాఫిక్ నిబంధనల అమలుపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ నాయకులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రెట్టింపు జరిమానా విధించాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు భద్రత విషయంలో ఎవరికీ మినహాయింపులు ఉండవని, నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను అరికట్టగలమని ఆమె స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లాలో 'సురక్షిత రోడ్లు.. సురక్షిత జీవితం' నినాదంతో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అడ్డరోడ్డు నుంచి నక్కపల్లి వరకు జరిగిన ఈ బైక్ ర్యాలీలో మంత్రి అనిత మాట్లాడుతూ.. "లక్షల రూపాయలు పెట్టి బైక్ కొనేవారు, ప్రాణాలను కాపాడే వెయ్యి రూపాయల హెల్మెట్‌ను కొని ధరించడానికి ఎందుకు ఆలోచిస్తున్నారు? ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది హెల్మెట్ లేకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారు. ప్రాణం విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలి" అని అన్నారు. ఈ సందర్భంగా తన పాయకరావుపేట నియోజకవర్గంలో జరిగిన రోడ్డు ప్రమాదాలను గుర్తుచేసుకుని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదు. మన నియోజకవర్గంలో ఒకే నెలలో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేశాయి. ఇకనైనా మేల్కొని 'హెల్మెట్ ధరిద్దాం-సురక్షితంగా పయనిద్దాం' అనే నినాదాన్ని పాటిద్దాం. మన ప్రాణాలను, మన కుటుంబాల భవిష్యత్తును కాపాడుకుందాం" అని అనిత పిలుపునిచ్చారు. ర్యాలీలో భాగంగా ఆమె పలువురు వాహనదారులకు స్వయంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని కోరారు.

## ఏపీకి రూ.1000 కోట్ల పెట్టుబడి..

## క్యారియర్ ఏసీ పరిశ్రమకు మంత్రి లోకేశ్ శంకుస్థాపన

**మొదటిపేజీ తరువాయి -** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... క్యారియర్ కేవలం ఒక కంపెనీ కాదని, ప్రపంచ శీతలీకరణ సాంకేతికతలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన మార్గదర్శి అని ప్రశంసించారు. తన జీవితంలో కొనుగోలు చేసిన మొట్టమొదటి ఏసీ కూడా క్యారియర్ బ్రాండ్‌దేనని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుంటూ, సీఎం చంద్రబాబు నాయుడు తన గదిని ఎప్పుడూ 17 డిగ్రీల సెల్సియస్ వద్ద చల్లగా ఉంచుకోవడానికి ఇష్టపడతారని, ఇప్పుడు ఆ గదిలో కూడా క్యారియర్ ఏసీనే ఉందని లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. దీంతో సభలో నవ్వులు పూశాయి.

### డేటా సెంటర్ల తయారీ హబ్‌గా ఏపీ

అనంతరం మంత్రి లోకేశ్ రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలపై తన దార్శనికతను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌ను కేవలం డేటా సెంటర్లను ఆకర్షించే రాష్ట్రంగా కాకుండా వాటికి అవసరమైన పూర్తి తయారీ పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించే హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "మేం కేవలం డేటా సెంటర్లను నిర్మించడం లేదు, వాటికి అవసరమైన పూర్తి వ్యవస్థను ఇక్కడే నిర్మిస్తున్నాం" అని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తీవ్రమైన పోటీ నెలకొని ఉందని, ఈ రేసులో ఏపీ ముందు వరుసలో నిలుస్తుందని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. డేటా సెంటర్లకు అత్యాధునిక కూలింగ్ సిస్టమ్స్, అధిక సామర్థ్యం గల చిల్లర్లు, పవర్ ఎలక్ట్రానిక్స్, ప్రెసిషన్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటివి అత్యంత కీలకమని, వీటికి అవసరమైన బలమైన సహాయక పర్యావరణ వ్యవస్థను నిర్మించడంపై దృష్టి సారించామని వివరించారు. ఈ బృహత్తర లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను, శ్రీసిటీని ఎంచుకున్నందుకు క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు ఆయన స్వాగతం పలికారు. ఈ పెట్టుబడి రాష్ట్ర డిజిటల్, పారిశ్రామిక అభివృద్ధిని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. క్యారియర్ వంటి సంస్థల రాకతో, డేటా సెంటర్లకు అవసరమైన కీలక పరికరాల తయారీ స్థానికంగానే జరిగి, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంటుందని మంత్రి లోకేశ్ తెలిపారు.

## రఘురాం రాజన్‌తో రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్..

## తెలంగాణ అభివృద్ధికి కీలక సూచనలు

**మొదటిపేజీ తరువాయి –** రఘురాం రాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా రఘురాం రాజన్ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరగాలంటే యువతలో నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించాలంటే ప్రభుత్వం అనుసరించే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాలు కీలకం అవుతాయని తెలిపారు. స్టార్టప్‌లను ప్రోత్సహించడం, మానవ వనరుల అభివృద్ధికి పౌష్టికాహార లోపాన్ని అధిగమించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. తమిళనాడు తరహా పారిశ్రామిక విధానం అనుసరిస్తే మరిన్ని పెట్టుబడులు ఆకర్షించవచ్చని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విద్యావ్యవస్థలో పాఠశాల స్థాయి నుంచి ఉన్నత, సాంకేతిక, వైద్య విద్య వరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ప్రవేశపెట్టేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలనుకుంటున్నామని, దీనికి సంబంధించి మార్గనిర్దేశం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి.. రఘురాం రాజన్‌ను కోరారు. రాష్ట్రంలో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా (ఏటీసీ) అభివృద్ధి చేసే ప్రణాళికలను సీఎం వివరించారు. చర్చల అనంతరం, రాబోయే మూడు, నాలుగు నెలల్లో హైదరాబాద్‌ను సందర్శిస్తానని రఘురాం రాజన్ తెలిపారు.

## తొలి ఎన్నికల్లోనే టీవీకే సంచలనం...

## ఇద్దరు బ్రాహ్మణ అభ్యర్థులతో విజయ్ వ్యూహం సక్సెస్

**మొదటిపేజీ తరువాయి -** మైలాపూర్ నుంచి పార్టీ కోశాధికారి వెంకటరామన్, శ్రీరంగం నుంచి రమేశ్ అనే ఇద్దరు బ్రాహ్మణ అభ్యర్థులను టీవీకే నిలబెట్టగా, వారిద్దరూ తమ తమ నియోజకవర్గాల్లో ఘన విజయం సాధించారు. దీంతో వీరిద్దరు కొత్త అసెంబ్లీలో బ్రాహ్మణ ప్రతినిధులుగా నిలిచారు. తమిళ రాజకీయాల్లో ఇది ఒక ముఖ్యమైన ఘట్టంగా చెప్పవచ్చు. దాదాపు 35 ఏళ్లలో తొలిసారిగా డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్, బీజేపీ వంటి ప్రధాన పార్టీలు ఒక్క బ్రాహ్మణ అభ్యర్థికి కూడా టికెట్ కేటాయించలేదు. దశాబ్దాలుగా ఈ వర్గం ప్రాతినిధ్యం తగ్గుతూ వస్తున్నా, ప్రధాన పార్టీల జాబితా నుంచి పూర్తిగా కనుమరుగు కావడం ఇదే మొదటిసారి. ద్రవిడ రాజకీయాల్లో సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల ప్రాతినిధ్యానికే పెద్దపీట వేస్తున్న తరుణంలో టీవీకే వ్యూహం కొత్త చర్చకు దారితీసింది. ఆసక్తికరంగా సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) కూడా ఈ ప్రయోగాన్ని అనుకరించే ప్రయత్నం చేసింది. బ్రాహ్మణ జనాభా అధికంగా ఉండే టి.నగర్, మైలాపూర్, సైదాపేట్, అలందూర్ వంటి నియోజకవర్గాల్లో ఏకంగా ఆరుగురు బ్రాహ్మణ అభ్యర్థులను నిలబెట్టింది. అయితే, ఎన్‌టీకే ప్రయోగం పూర్తిగా విఫలమైంది. వారి ఆరుగురు అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. కేవలం ఒక వర్గం వారిని నిలబెట్టినంత మాత్రాన ఎన్నికల్లో గెలవలేరని ఇది స్పష్టం చేస్తోంది. ఈ కుల సమీకరణాలకు అతీతంగా మొత్తం ఎన్నికల ఫలితాల్లో టీవీకే తన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. సుమారు 108 స్థానాల్లో గెలుపొంది, అసెంబ్లీలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. వ్యూహాత్మకంగా కొద్దిమందికే అవకాశమిచ్చిన టీవీకే వ్యూహం ఫలించగా, అదే బాటలో వెళ్లిన ఎన్‌టీకే విఫలం కావడం తమిళ రాజకీయాల్లో కొత్త సమీకరణాలను సూచిస్తోంది.

### అలా చేస్తే కేసులు వాపస్ : మంగ్లీకి న్యాయవాది సుబ్బారావు కీలక సూచన

**మొదటిపేజీ తరువాయి -** మైక్రోఫైనాన్స్ కేసులో మంగ్లీ ప్రతిసారి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగ్లీతో పాటు ఆమె సోదరుడు శివపై గద్వాల్, గచ్చిబౌలి, నల్గొండలలో కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ కేసులకు సంబంధించి వారు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. మైక్రోఫైనాన్స్ కేసులో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని తాము డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసినట్లు తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా కలుస్తామని అన్నారు. బాధితులకు న్యాయం జరగాలని ఆయన తెలిపారు. మైక్రోఫైనాన్స్ పేరిట అధిక లాభాలు వస్తాయని నమ్మించి మంగ్లీ, ఆమె సోదరుడు సహా మరికొంతమంది కోట్లాది రూపాయల మోసగించారని పలువురు బాధితులు సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది సుబ్బారావును కలిశారు. ఈ విషయం తెలుసుకోవడానికి సుబ్బారావు సంప్రదించగా, మంగ్లీ బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపిస్తూ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మరోవైపు, తనపై దుష్ప్రచారం చేసి సుబ్బారావు ప్రాచుర్యం పొందాలనుకుంటున్నారని మంగ్లీ న్యాయవాది సుబ్బారావుపై అదే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### 'యాక్ట్ ఈస్ట్' విధానంలో వియత్నాం కీలక దేశం : మోదీ



**మొదటిపేజీ తరువాయి -** సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్న అవగాహనకు వచ్చాయి. భారత పర్యటనకు వచ్చిన వియత్నాం అధ్యక్షుడు టో లాం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త సమావేశంలో మోదీ ప్రసంగించారు. భారత్ అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్' విధానంలో వియత్నాం కీలక దేశమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వియత్నాం సహకారంతో ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలను మరింత విస్తరిస్తామని చెప్పారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, శ్రేయస్సు కోసం వియత్నాంతో కలిసి భారత్ పని చేస్తుందని తెలిపారు. ఆర్థిక అనుసంధానతను పెంపొందించేందుకు రెండు దేశాల కేంద్ర బ్యాంకుల మధ్య సహకారాన్ని బలోపేతం చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మోదీ వెల్లడించారు. ఇందులో భాగంగా యూపీఐ వ్యవస్థను వియత్నాం ఫాస్ట్ పేమెంట్ సిస్టమ్‌తో త్వరలో అనుసంధానం చేయనున్నట్లు ప్రధాని వివరించారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 25 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మోదీ తెలిపారు. ఇరు దేశాల మధ్య భద్రత సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు వియత్నాం అధ్యక్షుడు టో లాం తెలిపారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు ఎక్కడా ఆగకూడదు

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు తడిసిన ధాన్యాన్ని తిరస్కరించవద్దు**

**టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 06( వార్త సంధ్య)** : పెద్దపల్లి జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు ఎక్కడా ఆగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లు, వర్షాల ప్రభావంపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో రైతుల వద్ద ఉన్న చివరి గింజ వరకు ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించవద్దని, ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ఆ ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయడానికి ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ ఎక్కడా ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టి సమీప పీపీసీ కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తగినంత తార్పాలిన్‌లు అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని వినియోగించుకోవాలని అన్నారు.రైతులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, ప్రతి ధాన్య గింజ కొనుగోలు చేయబడుతుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో డిసిఓ శ్రీ మాల, డీఎం సివిల్ సప్లై శ్రీకాంత్, డీఎస్‌ఓ శ్రీనాథ్, డిఎంఓ ప్రవీణ్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అభయ ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం లో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి





**ఎల్బీనగర్ ప్రతినిధి, మే 6 (వార్త సంధ్య)** : మాన్సురాబాద్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ సూపర్వైజర్ కాలనీలో శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భక్తి భావంతో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దేవాలయ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి హయత్‌నగర్ డివిజన్ భారాస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్ భాస్కర్ సాగర్ దేవాలయ కమిటీ సభ్యులు కాలనీవాసులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరతో కొనుగోలు...

**రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు డి. శ్రీధర్ బాబు**

**అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ప్రత్యేక చర్యలు**

**ధాన్యం రవాణా, హమాలీలు, గన్నీ బ్యాగులపై సమగ్ర ఏర్పాట్లు చేయాలి**

**మంథని మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన మంత్రి**



**మంథని, మే-06వార్త సంధ్య )** : ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి మంథని మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తెలిపారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ ద్వారా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా కల్పించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మేర గన్నీ బ్యాగులు, టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు.రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతు సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు.ఈ పర్యటనలో మంత్రి వెంట మంథని ఆర్డిఓ సురేష్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణ రాజు గారికి ఘన సన్మానం



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 06 (వార్త సంధ్య)** : కొత్తగూడెం ఏరియా ఇంజనీర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ, కార్మికులతో సత్సంబంధాలు నెలకొల్పి, సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించిన సూర్యనారాయణ రాజు గారు బదిలీపై శ్రీరాంపూర్ వెళ్తున్న సందర్భంగా, ఆర్‌సీహెచ్‌పీ కార్మికులు బుధవారం ఉదయం ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ,సూర్యనారాయణ రాజు గారు కొత్తగూడెం ఏరియా లో తమ పదవీకాలంలో కార్మికుల సంక్షేమం,సమస్యల పరిష్కారం,బొగ్గు ఉత్పత్తి ఉత్పాదక,మరియు పనితీరు మెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు.కార్మికుల పట్ల ఆయన చూపిన సహానుభూతి, పరిపాలనా నైపుణ్యం, సమయోచిత నిర్ణయాలు ఆయనను ప్రత్యేక వ్యక్తిత్వంగా నిలబెట్టాయని కొనియాడారు.అలాగే, యాజమాన్యం మరియు కార్మికుల మధ్య సమన్వయం కల్పించడంలో ఆయన పాత్ర ప్రశంసనీయమని, అందువల్ల కార్మికుల విశ్వాసాన్ని సంపాదించగలిగారని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఆయన ఇలాగే ఉన్నత స్థాయిలో సేవలు అందిస్తూ మరింత ఉన్నత పదవులను అలంకరించాలన ఆకాంక్షిస్తూ,హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆర్ సి హెచ్ పి హెచ్‌ఓడి అజ్మీరా శ్రీనివాస్, డివై ఎస్‌ఈ లింగ, జూనియర్ ఇంజనీర్ రవి, ఎఐటియుసి సహాయ కార్యదర్శి గట్టయ్య, సురేందర్,మురళి, ఐ ఎన్ టీ యు సి నాయకులు కుమార్,అనిల్, ఆర్ సి హెచ్ పి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందాలి

**- రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు**

**- గంగాపురి లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణ**





**మంథని మే, 6 వార్త సంధ్య )** : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం గంగాపురి గ్రామంలోని ఆర్ఆర్ గార్డెన్ లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా మంథని ఆర్ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాటారం, మహాముత్తారం, మహాదేవపూర్, మలహర్రావు, పలిమెల మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు అందజేస్తూ ప్రభుత్వ సేవలు ఇంకా వేగంగా అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇందుకు అధికారులు కట్టుదిట్టంగా పని చేయాలని ఆయన ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు నేరుగా లాభం చేకూరేలా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మహిళల సంక్షేమం, పేద కుటుంబాల ఆర్థిక భద్రత, పిల్లల పోషణ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని వివరించారు. అకాల వర్షాల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ తడిసిన ప్రతి వరి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఒక్క రైతు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, మంథని ఆర్డీఓ సురేష్, మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, రాష్ట్ర విద్యుత్ బోర్డ్ మెంబర్ శశిభూషణ్ కాచే తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

**నిత్యావసరాల ధరల నివారణకు చర్యలు చేపట్టాలి**

**ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి**

**కార్పొరేట్ శక్తుల దోపిడీని అరికట్టాలి**

**ప్రజల ప్రాథమిక అవసరాలను హక్కుగా గుర్తించాలి**

**దేశంలో ఇంధన కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి**

**ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేస్తాం**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**సిపిఐ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో ప్లకార్డులు, ఖాళీ సిలిండర్లతో ధర్నా**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 06 (వార్త సంధ్య)** : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశప్రజలకోసం కాకుండా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుండంవల్లే సామాన్య ప్రజలపై నిత్యావసర భారాలు విపరీతంగా పెరుగుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాళీ సిలిండర్లు, ప్లకార్డులతో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భగా కూనంనేని మాట్లాడుతూ ఆకాశాన్నంటుతున్న గ్యాస్ ధరలతో సామాన్యుడి వంటిల్లు మండుతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిత్యావసరాల ధరల నివారణకు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టకుండా, కార్పొరేట్ శక్తుల దోపిడీకి ఎర్రటి తివాచీ పరుస్తున్నారని మండిపడ్డారు. ప్రజాపంపిణీ వ్యవస్థను అటకెక్కించి పేదల నోటికాడ కూడును లాగేస్తున్నారని, వెంటనే పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అయన డిమాండ్ చేశారు. ప్రజల ప్రాథమిక అవసరాలను హక్కుగా గుర్తించి నెరవేర్చాల్సింది పోయి, వాటిని వ్యాపార వస్తువులుగా మార్చడం సిగ్గుచేటన్నారు. దేశంలో ఇంధన కొరతపై ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళికే లేదని, ఇప్పటికైనా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సామాన్యుడి గొంతుకై నిలబడతామని, ఈ పోరాటాలను గ్రామ గ్రామానికి ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, ఎస్ కె ఫహీమ్, దీటి లక్ష్మీపతి, కె రత్నకుమారి, మునిగడప పద్మ, కార్పొరేటర్లు, కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ బిల్డింగ్ శంకుస్థాపన చేస్తూ, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి






**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 6** : "ఫ్యూచర్ సిటీ విషయంలో కొంతమందికి కష్టం ఉంది. సరైన నష్టపరిహారం రాలేదన్న బాధ కొందరి రైతుల్లో ఉంది. ఫ్యూచర్ సిటీలో భూములు కోల్పోతున్న వారు డబ్బులు తీసుకుని కొంచెం దూరంలో భూమి కొనుకోవచ్చు." అని సెలవిచ్చారు. ముఖ్య మంత్రికి కొన్ని విషయాలు గుర్తు చెయ్యాలి. గతంలో ప్రతిపక్షం లో ఉన్నప్పుడు మీరు పాదయాత్ర చేస్తున్నప్పుడు ఫార్మా సిటీ బాధిత రైతులము మేము మిమల్ని కలిసి మా భూములు పోతే బ్రతకలేము, మాకు సహాయం చెయ్యండి అని అడిగినప్పుడు, తప్పకుండా మీ భూములు కాపాడుతామన్నారు. కాంగ్రెస్ నాయకులు భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కోదండరెడ్డి, మలరెడ్డి రంగారెడ్డి అందరు మీరు భూములు ఇయ్యొద్దు, మేము అధికారం లోకి రాగానే మీ భూసేకరణ రద్దు చేసి మీకు పూర్తి హక్కులు కల్పిస్తాం, ఫార్మా సిటీ ని రద్దు చేస్తాం అని ఈ ప్రాంతంలో మాతో కలిసి పాదయాత్రలు చేశారు. ఫార్మా సిటీ ని రద్దు చేస్తాం, దాని స్థానం లో ఫ్యూచర్ సిటీ కడతాం, మీ భూములు ఎట్లాగైనా గుంజు కుంటాం అని ఎలక్షన్ ముందే చెప్పవలసింది. అట్లా చెప్పి ఓట్లు వేయించు కోలేదు కదా? ఫార్మా సిటీ ని రద్దు చేసాం అని ఉట్టి మాటలు చెప్పి, ఇప్పటికీ ఫార్మా జి. ఓ రద్దు చెయ్యలేదు. అప్పుడు భూములు కాపాడుతా అని హామీ ఇచ్చి ఇప్పుడు భూములు గుంజుకుంటున్నారు. ముఖ్యమంత్రి నిన్న నిలబడిన చోటు నుంచి కేవలం 5 కిలోమీటర్ల దూరంలో మా భూములు వదిలెయ్యండి, గ్రీన్ ఫీల్డ్ రోడ్డు రద్దు చెయ్యండి అని గత 46 రోజులు గా నిరాహార దీక్ష చేస్తున్న గిరిజన రైతుల గోష ముఖ్యమంత్రికి వినిపించటం లేదు. అదే ప్రాంతంలో నాడు కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేసి ఈ మూడు పంటలు పండే భూములు ఎట్టి పరిస్థితి లో ఇయ్యొద్దు, మీకు మేము అండగా ఉంటాం అని నమ్మించారు. మాకు మా భూమే కావాలని కోర్టు లో స్టే తెచ్చుకున్న నాలుగు గ్రామాల రైతులని గతంలో మీ భూములు మీకే అని నమ్మించిన ముఖ్యమంత్రి , కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ రోజు డబ్బులు తీసుకొని ఎక్కడైనా దూరంగా భూములు కొనుక్కోవచ్చు అని ఎంత తేలికగా సలహాలు ఇస్తున్నారు. "ముఖ్యమంత్రి మరి ఇక్కడ భూములు తీసుకోవాలనుకున్నప్పుడు మీరు, మీ పార్టీ నాయకులు మీ భూములని మా రైతులకి ఇయ్యండి. మాకు మీ భూములు ఇచ్చి అక్కడ మీ భూముల వద్దనే మా ఊర్లని కట్టించండి. అంత గొప్ప ఫ్యూచర్ సిటీ కోసం, దేశ భవిష్యత్ కోసం ఎకరా, రెండేకరా రైతులని త్యాగం చెయ్యమనే బదులు ఆ త్యాగాలేవో మీరు, మీ పార్టీ నాయకులు చేస్తే మీరు చరిత్రలో నిలిచిపోతారు".

**ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ రైతులు**

కుందారపు నారాయణ, విస్లావత్ సత్తులాల్, నేనావత్ పంత్య, విస్లావత్ జ్యోతి, పంగ అనసూయమ్మ, బర్ల కొమరయ్య, బుక్క చెన్నయ్య, గడ్డం రవీందర్, పంగ మణెమ్మ, అందెకర్ దేవోజీ, సోమయ్య, మండలి రాములు తదితరులు..

## నర్సింహులపేట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి**

**మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్**






**మహబూబాబాద్ జిల్లా బ్యూరో, మే 06 (వార్త సంధ్య)** : మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ నర్సింహులపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, విధి నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది పనితీరును సమీక్షించిన ఎస్పీ, ప్రతి పోలీస్ అధికారి విధి సమయాల్లో తప్పనిసరిగా స్టేషన్‌లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ సులభంగా చేరుకునే విధంగా సేవలు అందించాలని సూచించారు. పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించి, నాణ్యమైన విచారణ చేయాలని, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు. బీట్ వ్యవస్థను కచ్చితంగా అమలు చేస్తూ గ్రామాల్లో నేర నివారణ చర్యలను బలోపేతం చేయాలని సూచించారు. అలాగే సీసీటీవీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించాలని తెలిపారు. స్టేషన్ పరిసరాలను శుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచడంతో పాటు మహిళలు, వృద్ధులు, పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బి. వెంకన్న మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అశ్వాపురంలో ఘనంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల జన్మదిన వేడుకలు




**భద్రాద్రి జిల్లా బ్యూరో మే 06 (వార్త సంధ్య)** : అశ్వాపురం మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్ల జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించ బడ్డాయి. ఈ వేడుకలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వయంగా హాజరై, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆనందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల, జిల్లా స్థాయి నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లిలో భక్తి పారవశ్యం.. మహా కుంభాభిషేకం వైభవం

**చినజీయర్ స్వామి పర్యవేక్షణలో వేదోక్తంగా క్రతువులు**

**మంత్రి పొంగులేటి దంపతుల ప్రత్యేక పాల్గొనడం**

**గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 06 (వార్త సంధ్య)** : భక్తి భావం వెల్లివిరిసింది.. వేద మంత్రాల నాదంతో గ్రామం మార్మోగింది. అన్నపురెడ్డిపల్లి శ్రీశ్రీశ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం నిర్వహించిన మహా కుంభాభిషేక మహోత్సవం ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది. లోక కల్యాణార్థం నిర్వహించిన ఈ పుణ్యకార్యంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాధురి దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. పరమపూజ్య శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి వారి దివ్య పర్యవేక్షణలో జరిగిన ఈ మహోత్సవం భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లింది. బ్రహ్మముహూర్తం నుంచే అర్చకులు హోమాలు, జపాలతో క్రతువులను ప్రారంభించారు. అనంతరం చినజీయర్ స్వామి వారి చేతుల మీదుగా కలశాలకు పవిత్ర జలాలతో అభిషేకం చేయగా, భక్తులు "గోవింద.. గోవింద" అంటూ నామస్మరణతో దిక్కులు పిక్కటిల్లేలా చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, "చినజీయర్ స్వామి వారి పావన హస్తాలతో ఈ మహా కుంభాభిషేకం జరగడం గొప్ప అదృష్టం. స్వామివారి కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు నెలకొనాలని ప్రార్థించాను" అని పేర్కొన్నారు. వేదాశీర్వచన కార్యక్రమంలో పండితులు మంత్రి దంపతులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, జిల్లా కలెక్టర్ అంకిత్, డీసీసీ అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వడ్డెర కార్పొరేషన్ సొసైటీ చైర్మన్ గుంజ రేణుక నారాయణ



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 6** :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డెర కార్పొరేషన్ సొసైటీనికి నూతనంగా చైర్మన్ గా ఎన్నికైన గుంజ రేణుక నారాయణ ని కలిసిన అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ యువజన అధ్యక్షుడు డాక్టర్ వేముల లోకేష్. అఖిలభారత వడ్డెర సంఘం అభివృద్ధి కృషి చేయాలని కోరారు ల సమస్యలను వడ్డెరల సమస్యలను చైర్మన్ దృష్టి తీసుకురావాలని ఆయన కోరారు యువత పెడదారిన పట్టకుండా ప్రభుత్వ పథకాలను సద్విని చేసుకోవాలని డాక్టర్ వేముల లోకేష్ కోరారు

## బాలేగాట్ చిరంజీవికి ఆర్థిక సహాయం కె.వి.రమణాచారి



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 6 :** తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సంక్షేమ నిధి కార్యక్రమం ప్రారంభించిన తర్వాత మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెలికట్టే గ్రామమునకి చెందిన బాలేగార్ చిరంజీవి మరణించడం చాలా బాధాకరం ఇటువంటి విషయాలు ఎవరికికూడా రాకూడదు అయినా విధిరాత ఎవరు తప్పించలేరు బాలే గాట్ చిరంజీవి మరణించినందుకు గాను అతని కుటుంబానికి సంఘం నుండి సంక్షేమ పథకంలో చేరినందుకు గాను పెద్దలు మాజీ ప్రభుత్వ సలహాదారుడు రిటైర్డ్ ఐఎస్ , తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ బి.వి.రమణాచారి కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా పదివేల రూపాయల చెక్కు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు వంగ శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచు లింగయ్య రాష్ట్ర కోశాధికారి మేకల నారాయణ మహిళా అధ్యక్షురాలు విజయ శ్రీ మేడం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఉందే టి కవిత మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు అక్కెర నాగేంద్ర చారి రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆంజనేయులు వేలికట్టే గ్రామానికి చెందిన భూపతి కోటేశ్వర్ నాయకుల బిక్షపతి పాల్గొన్నారు ఇందుకు మృతుని భార్యబాలేగాట్ సావిత్రి తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘమునకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

## జూపల్లి కోటి నాగులు వర్ధంతి
## జ్ఞాపకార్థం రైస్ బ్యాగులు, పళ్ళు పలహారాలు వితరణ....



**తిరువూరు,మే 06 (వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** స్థానిక పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న జూపల్లి సూర్యనారాయణ తండ్రి అయిన జూపల్లి కోటి నాగులు 20వ వర్ధంతి జ్ఞాపకార్థం సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని జన్మభూమి రోడ్ లో గల భగవాన్ శ్రీ రమణ మహర్షి అంధులు వికలాంగులు అనాధ బాలల సేవ ఆశ్రమం లో అన్నదాన కార్యక్రమం నిమిత్తం ప్రార్ధించే పెదవులు కన్నా సాయం అందించే చేతులు మిన్న అని రైస్ బ్యాగ్ మరియు నిత్యవసర వస్తువులు మరియు పళ్ళు ఫలహారాలు ఆశ్రమ నిర్వాహకులు వెంపాటి అబ్రహం మణిరత్నం కు అందజేశారు. అలాగే లక్ష్మీపురం గ్రామ చెక్ పోస్ట్ దగ్గరలో తాత్కాలిక పరదాలతో నివాసం ఏర్పాటు చేసుకుని భార్య ఇద్దరు కుమార్తెలతో జీవనం గడుపుతున్న రాము నిరుపేద కుటుంబానికి తమ వంతు సహాయంగా రైస్ బ్యాగ్ , సరుకులు, స్నాక్స్ మరియు పళ్ళు ఫలహారాలు వితరణగా అందజేశారు.ఈ కార్యక్రమంలో కోటి నాగులు కుటుంబ సభ్యులు, కానిస్టేబుల్ సూర్యనారాయణ, హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ మాదాసు టైటాస్ పాల్గొన్నారు.

## పాల్వంచ శ్రీనివాస కాలనీకి ఉపశమనం..

### డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం
### స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా బయోమైనింగ్ పనులు వేగవంతం
### ఏళ్ల తరబడి పేరుకున్న చెత్తకు శాస్త్రీయ పరిష్కారం
### దుర్వాసన నుంచి విముక్తి పొందుతున్న స్థానికులు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 06 (వార్త సంధ్య) :** ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్తాచెదారం, భరించలేని దుర్వాసనతో నిత్యం ఇబ్బందులు పడుతున్న శ్రీనివాస కాలనీ ప్రజలకు ఎట్టకేలకు ఉపశమనం లభిస్తోంది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఈ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వ 'స్వచ్ఛ భారత్' మిషన్‌లో భాగంగా పాల్వంచలో బయోమైనింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియ ద్వారా పాత చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి, పునర్వినియోగానికి అనుకూలంగా మార్చుతున్నారు. దీంతో సంవత్సరాలుగా పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించబడుతూ, పరిసరాల్లో స్వచ్ఛత పెరుగుతోంది. ఇప్పటివరకు దుర్వాసన, కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు ఈ చర్యలతో ఊపిరి పీల్చుకుంటున్నారు. బయోమైనింగ్ పూర్తయ్యాక ఆ ప్రాంతం పూర్తిగా శుభ్రపడి, పర్యావరణానికి అనుకూలంగా మారుతుందని అధికారులు తెలిపారు.

## జన్మదినం సందర్భంగా హరీష్ రావును కలిసిన
## బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్



**ఎల్బీనగర్, మే 06(వార్త సంధ్య) :** ఎల్బీనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ తన జన్మదినం పురస్కరించుకొని మాజీ మంత్రి హరీష్ రావుని తననివాసంలో మర్యాదపూర్వంగా కలిసి పుట్టినరోజు ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో శ్రీనివాస్ ప్రజాసేవకై పాటుపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సరూర్నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎం వి ఎస్ ఫౌండేషన్
## మామిడి బ్రదర్ ఆధ్వర్యంలో చల్లని మజ్జిగ పంపిణీ..



**తిరువూరు,మే06(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** పట్టణ పరిధిలోని బస్టాండ్ సెంటర్ శివాలయం దగ్గర ఎంవిఎస్ ఫౌండేషన్ మామిడి బ్రదర్ నరేంద్ర (నాని) & సురేంద్ర (నాని)ఆధ్వర్యంలో వేసవి తాపం పురస్కరించుకొని ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చల్లని మజ్జిగ పంపిణీ బస్టాండ్ సెంటర్ ఆటో స్టాండ్ (7ఎస్.ఎస్.)యూనియన్ అధ్యక్షులు ఓర్సు గోపి ముఖ్యఅతిథిగా పాల్గొని చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మెగా చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో సుమారు 1000 మందికి పైగా పంపిణీ చేసి వేసవితాపం ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తీవ్రంగా ఉన్న ఎండలు వల్ల వడదెబ్బ కొట్టకుండా వారి దాహాన్ని తీర్చారు.ఈ కార్యక్రమం లో ఎంవీఎస్ ఫౌండేషన్ మామిడి సురేంద్ర (నాని), బస్టాండ్ సెంటర్ ఆటో యూనియన్ అధ్యక్షులు ఓర్సు గోపి, హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ అధ్యక్షులు మద్దిబోయిన నరేష్, ప్రదీప్, వేణు,తిగుళ్ల బసవయ్య, భూక్య సైదా నాయక్, గొర్రెపాటి వెంకటరత్నం,గుంజ నాగరాజు ,రామకోటరెడ్డి ,గుంజ వెంకయ్య, ఓర్సు వంశి, గుంజ వెంకీ, తిరువూరు కామెడీ స్టార్ పజిల్ భాయ్, మాదాసు టైటాస్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు సన్నాహాలు వేగవంతం...

**తిరువూరు,మే06(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాక కోసం తిరువూరు నియోజకవర్గ ప్రజలు దాదాపు 28 నెలలుగా ఎదురుచూస్తున్నారని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ.కొండూరు మండలం వెస్ట్ మాధవరం గ్రామానికి వచ్చి రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్న నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు సభా స్థలం మరియు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్నారని కొలికపుడి తెలిపారు. తిరువూరులోని శాసనసభ్యులు వారి క్యాంప్ కార్యాలయంలో జనసేనబీజేపీ కూటమి నాయకులతో కలిసి నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ,మెట్ట గిరిజన ప్రభావిత ప్రాంతమైన ఏ.కొండూరు మండలాన్ని నూతన రాష్ట్రం ఏర్పడిన తరువాత ఏ ముఖ్యమంత్రి కూడా సందర్శించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మాధవరం గ్రామానికి రావడం నియోజకవర్గ ప్రజలతో పాటు గిరిజనుల్లో ఆనందాన్ని కలిగించిందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, రహదారుల నిర్మాణం, రైతు సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వ కాలంలో రైతు పాస్



పుస్తకాలపై రాష్ట్ర రాజముద్రకు బదులుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫోటో ముద్రించారని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్ర రాజముద్రతో రైతులందరికీ పాస్ పుస్తకాలు అందజేస్తోందని అయన తెలిపారు.

ఏ.కొండూరు మండలం కిడ్నీ సమస్యలకు ప్రభావిత ప్రాంతమని గుర్తుచేసిన అయన, కూటమి ప్రభుత్వం 201419 కాలంలోనే జలజీవన్ ప్రాజెక్టుకు నిధులు కేటాయిం చిందన్నారు. అనంతరం వచ్చిన ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోలేదని ఆరోపించారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.49 కోట్లతో జలజీవన్ పనులను వేగవంతం చేసి, ఇంటింటికీ పైపుల ద్వారా శుద్ధమైన కృష్ణా జలాలను తాగునీరుగా అందించుటకు పనులు పూర్తి అవడం జరిగిందని తెలిపారు.అదేవిధంగా మరిన్ని గ్రామాలకు కృష్ణా జలాలు అందేలా కొత్త ప్రాజెక్టులను రూపకల్పన చేస్తున్నామని,పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని తిరువూరు నియోజకవర్గ ప్రజలకు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వేలో విశాఖ జోన్ కేంద్రం ప్రకటించడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి కి ఫలితమని కొలికపుడి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కొలికపూడి శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో నాలుగు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మాధవరం గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సమగ్ర సన్నాహక సమావేశం..

**ఎ.కొండూరు,మే06(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** ఏ కొండూరు మండలం, మాధవరం గ్రామంలో ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో గ్రామం లో సమగ్ర సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశా ఐ.ఏ.ఎస్, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ అన్ని రకాల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి,విభాగాల వారీగా బాధ్యతలను కేటాయిస్తూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశం లో తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు మరియు రాష్ట్ర సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమ భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జెడ్ ప్లస్ స్థాయి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రహదారులు, పార్కింగ్ ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు.సభా ప్రాంగణంలో వీఐపీ, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయాలు, ప్రోటోకాల్ ప్రకారం నిర్వహణ చేపట్టాలని తెలిపారు. తాగునీరు,



మొబైల్ టాయిలెట్లు, శుభ్రత, అలంకరణ పనులను పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు అప్పగించారు.ఆరోగ్య శాఖ ద్వారా మెడికల్ క్యాంపులు, అంబులెన్స్ సేవలు, అత్యవసర వైద్య సదుపాయా లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సమాచారం ప్రజాసంబంధాల శాఖకు మీడియా గ్యాలరీ,ప్రసార ఏర్పాట్ల బాధ్యతలుఅప్పగించారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలని మరియు అగ్నిమాపక శాఖ అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని సూచించారు.ఆహార భద్రత అధికారులు ఆహార నాణ్యతను పర్యవేక్షించాలని ఆదేశించారు.సమావేశం అనంతరం ఎమ్మెల్యే సభా స్థలంలో జరుగుతున్న ఏర్పాట్లను మరియు హెలికాప్టర్ (హెలిప్యాడ్) దిగే ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ లక్ష్మీశా మరియు ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ తో కలిసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్ తదితర శాఖల అధికారులు మరియు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రెడీ టూ సర్వ్‘ వృద్ధాశ్రమానికి అర్గానో సాఫ్ట్‌వేర్ సంస్థ అండ

**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి,మే 06:** సమాజంలో ఆదరణ కరువైన వృద్ధులకు అండగా నిలుస్తోంది ప్రముఖ సంస్థ 'అర్గానో సాఫ్ట్‌వేర్‘ కార్పొరేట్ సామాజిక బాధ్యత సి.ఎస్.ఆర్ లో భాగంగా కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా, తమ సేవాగుణాన్ని చాటుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. వనస్థలిపురంలోని 'రెడీ టూ సర్వ్‘ వృద్ధాశ్రమానికి విశేష దాతృత్వాన్ని పంచుతూ, పండుటాకుల పట్ల తమకున్న సామాజిక బాధ్యతను ఘనంగా చాటుకుంటోంది.

### ఆరు నెలలుగా క్రమం తప్పని సాయం

గత ఆరు నెలలుగా 'రెడీ టూ సర్వ్‘ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమానికి అర్గానో సాఫ్ట్‌వేర్ సంస్థ పెద్ద దిక్కుగా మారింది. ఆశ్రమవాసుల అవసరాలను సూక్ష్మంగా గమనించి, వారికి అత్యంత అవసరమైన కిరాణా సరుకులు, ప్రాణాలను నిలిపే అత్యవసర మందులను ప్రతి నెలా క్రమం తప్పకుండా అందజేస్తోంది. వారి కనీస అవసరాలను తీరుస్తూ పెద్దలకు కొండంత భరోసా కల్పిస్తోంది.

### లక్షల నిధులతో వసతుల కల్పన

కేవలం నెలవారీ సరుకులతోనే తమ బాధ్యత తీరిపోయిందని



అనుకోకుండా, ఆశ్రమ వాసుల సౌకర్యార్థం అర్గానో సంస్థ భారీగా నిధులు వెచ్చించింది. 'రెడీ టూ సర్వ్‘ నిర్వాహకుల అభ్యర్థన మేరకు వెంటనే స్పందించిన యాజమాన్యం.. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆశ్రమంలో మౌలిక వసతులు కల్పించింది. ఎండాకాలంలో వృద్ధులు ఉక్కపోతతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎయిర్ కూలర్లు, అలాగే స్వచ్ఛమైన తాగునీటి కోసం అధునాతన వాటర్ డిస్పెన్సర్లను కూడా సమకూర్చింది.

### సేవయే పరమావధిగా..

"“వృద్ధుల సౌకర్యం, ఆరోగ్యం, ఆనందం.. ఇవే మా సంస్థ సేవ కార్యక్రమాల ప్రథమ లక్ష్యం“ అంటూ అర్గానో సాఫ్ట్‌వేర్ ఇండియా ఎం.డి మధుసూదన్ సెరి పేర్కొన్నారు

### కృతజ్ఞతలు తెలిపిన నిర్వాహకులు

తమ ఆశ్రమానికి అడిగిన వెంటనే మౌలిక వసతులు కల్పించడమే కాకుండా, ప్రతినెలా క్రమం తప్పకుండా ఆదుకుంటున్న అర్గానో సాఫ్ట్‌వేర్ సంస్థ యాజమాన్యానికి 'రెడీ టూ సర్వ్‘ సంస్థ నిర్వాహకులు పెద్ది శంకర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేట్ సంస్థలు ఇలా సామాజిక స్పృహతో ముందుకు వస్తే, సమాజంలో నిస్సహాయ స్థితిలో ఉన్న ఎంతో మంది అభాగ్యులకు మరింత మెరుగైన సేవలు అందించగలమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అర్గానో సంస్థ చూపుతున్న ఈ చొరవ సమాజంలోని ఇతర కార్పొరేట్ సంస్థలకు సైతం స్ఫూర్తిదాయకం, మార్గదర్శకత్వం.


## నాగోల్‌లో ఘనంగా 'డిజి లోన్స్' కార్యాలయ ప్రారంభోత్సవం

### అందుబాటులోకి అన్ని రకాల రుణ సదుపాయాలు



**ఎల్బీనగర్, మే 6 (వార్త సంధ్య): :** హైదరాబాద్‌లోని నాగోల్ ప్రాంతంలో ఆర్థిక సేవల రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. సాయి నగర్ రోడ్ నెంబర్ 3లో 'స్టార్ పవర్స్ డిజిటల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‘ వారి 'డిజి లోన్స్‘ నూతన బ్రాంచ్‌ను అత్యంత వైభవంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి సంస్థ చైర్మన్ బొల్ల శివ రామకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన గావించి, నాగోల్ బ్రాంచ్ కార్యకలాపాలను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాన్య ప్రజలకు, వ్యాపారవేత్తలకు వేగవంతమైన, పారదర్శకమైన రుణ సదుపాయాలను అందించడమే తమ సంస్థ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రొపరైటర్ నాగరాజు మాట్లాడుతూ.. తమ వద్ద అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా వివిధ రకాల లోన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, హోమ్ లోన్స్ మరియు ఇతర అన్ని రకాల రుణ సదుపాయాలు తక్కువ సమయంలోనే ప్రాసెస్ చేయబడతాయని ఆయన వెల్లడించారు.స్థానిక ప్రముఖులు, వ్యాపారస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ ప్రారంభోత్సవ వేడుకతో, నాగోల్ చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఆర్థిక అవసరాల కోసం ఒకే చోట అన్ని పరిష్కారాలు లభించనున్నాయి.

## ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 06:** మాన్సురాబాద్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ సూపర్వైజర్ కాలనీలో శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భక్తి భావంతో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దేవాలయ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ భారాస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్, భాస్కర్ సాగర్, దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఆర్ బీ చౌదరి మృతికి ప్రముఖుల సంతాపాలు

### ఆర్బీ చౌదరి మృతి పట్ల పవన్, చిరంజీవి, రజనీకాంత్ సంతాపం
### తాను నటించిన 'సుస్వాగతం' చిత్రాన్ని ఆయనే నిర్మించారన్న పవన్ కల్యాణ్
### 'గాడ్‌ఫాదర్‘కు కలిసి పనిచేశామన్న చిరంజీవి
### ఆర్బీ ఎందరో యువ దర్శకులకు అవకాశాలిచ్చారన్న రజనీకాంత్

ప్రముఖ చలనచిత్ర నిర్మాత, సూపర్ గుడ్ ఫిల్మ్స్ అధినేత ఆర్బీ చౌదరి (76) అకాల మరణం చిత్ర పరిశ్రమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ సమీపంలో నిన్న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆయన దుర్మరణం పాలయ్యారు. ఈ వార్త తెలియగానే దక్షిణాది చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. పలువురు సినీ ప్రముఖులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. చిత్ర పరిశ్రమకు ఆయన ఎంతో కృషి చేశారంటూ కొనియాడారు.ఆయన మరణం పట్ల ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తాను నటించిన 'సుస్వాగతం' చిత్రాన్ని ఆయనే నిర్మించారని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి స్పందిస్తూ, “ఆర్‌బీ చౌదరి గారి ఆకస్మిక మరణ వార్త నన్ను తీవ్రంగా కలిచివేసింది. మేం కలిసి 'గాడ్‌ఫాదర్‘కు పనిచేశాం,“ అని గుర్తుచేసుకున్నారు.సూపర్‌స్టార్ రజనీకాంత్, “నా స్నేహితుడు ఆర్బీ చౌదరి గొప్ప నిర్మాత. ఎందరో యువ దర్శకులకు అవకాశాలిచ్చారు“ అని అన్నారు. “సూర్యవంశం, రాజా వంటి చిత్రాల్లో ఆయన బ్యానర్‌లో నటించడం నా అదృష్టం“ అని వెంకటేశ్ అన్నారు. ఆర్బీ చౌదరి మరణ వార్త షాకింగ్ కు గురి చేసిందని విశాల్ పేర్కొన్నారు.

## హర్మూజ్ మీదుగా వెళ్తూ అదృశ్యమైన
## అమెరికా 'ఫ్లైయింగ్ గ్యాస్ స్టేషన్' విమానం

### రాడార్ నుంచి మాయమవడానికి ముందు అత్యవసర సిగ్నల్
### ఖతార్ వైపు వెళ్తుండగా హర్మూజ్ జలసంధి సమీపంలో ఘటన
### అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆందోళన

గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర ఆందోళన నెలకొంది. అమెరికా వైమానిక దళానికి చెందిన కేసీ-135 స్ట్రాటోట్యాంకర్ విమానం అత్యవసర పరిస్థితిని సూచించే సిగ్నల్ పంపిన కాసేపటికే రాడార్ నుంచి అదృశ్యమైంది. హర్మూజ్ జలసంధి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకోవడం ఉద్రిక్తతకు దారితీస్తోంది.ఫ్లైట్ ట్రాకింగ్ వ్యవస్థల సమాచారం ప్రకారం ఈ విమానం గల్ఫ్ గగనతలంపై ఇంధనం నింపే కార్యకలాపాల్లో ఉండగా, ప్రమాదాన్ని సూచించే 7700 స్క్వాక్ కోడ్‌ను ప్రసారం చేసింది. అనంతరం తన మార్గాన్ని మార్చుకుని ఖతార్‌లోని సైనిక స్థావరం వైపు పయనిస్తున్నట్లు కనిపించింది. అయితే, ఎమర్జెన్సీ కోడ్ పంపిన గంట తర్వాత దాని ట్రాన్స్‌పాండర్ సిగ్నల్ పూర్తిగా నిలిచిపోయిందని 'గల్ఫ్ న్యూస్' కథనం వెల్లడించింది.గాలిలో ఇతర విమానాలకు ఇంధనం నింపే సామర్థ్యం ఉన్నందున ఈ విమానాన్ని 'ఫ్లయింగ్ గ్యాస్ స్టేషన్' అని పిలుస్తారు. సాధారణంగా యాంత్రిక లోపాలు, విమానంలో మంటలు, లేదా బాహ్య ముప్పు వంటి సందర్భాల్లో 7700 కోడ్‌ను ఉపయోగిస్తారు. పశ్చిమాసియాలో ఘర్షణల తర్వాత అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఈ ఘటన జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.సిగ్నల్ కోల్పోయినంత మాత్రాన విమానం కూలిపోయిందని నిర్ధారించలేనప్పటికీ, ఎమర్జెన్సీ సిగ్నల్ తర్వాత అదృశ్యం కావడం తీవ్రమైన ఘటన జరిగి ఉండవచ్చనే అనుమానాలను బలపరుస్తోంది. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు ఎలాంటి శిథిలాలు లభించలేదు. సహాయక చర్యలపై కూడా ఎటువంటి సమాచారం లేదు. గతంలో ఇరాన్ పలు అమెరికా విమానాలను కూల్చివేసినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఈ ఘటనపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

వార్త సంధ్య
RNI TGTEL/25/A5065
జనరల్ న్యూస్
గురువారం
07 - 05 - 2026


# ఫీజుల దోపిడీపై గళమెత్తిన కల్వకుంట్ల కవిత

నాణ్యమైన విద్య ఫీజుల నియంత్రణపై రౌండ్ టేబుల్ సమావేశం

మే నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్






**హైదరాబాద్/ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బ్యూరో , వార్త సంధ్య, మే 06:** హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన "నాణ్యమైన విద్య ఫీజుల నియంత్రణ" రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యా వ్యవస్థ, ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల పెంపు, ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కవిత మాట్లాడుతూ, ముఖ్యమంత్రి విద్యాశాఖ మంత్రిగా కూడా వ్యవహరించడం రాష్ట్రానికి దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. స్కూల్ ఫీజులు 50 శాతం నుంచి 120 శాతం వరకు పెరిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా విద్యా రంగంలో ప్రజల పట్ల సంవేదనతో పాలన సాగలేదని విమర్శించారు.

### ఫీజుల నియంత్రణకు చట్టం అవసరం

మే నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం ప్రభుత్వాల బాధ్యతగా ఉండాలని స్పష్టం చేశారు. పిల్లల చదువు బాధ్యత కేవలం తల్లిదండ్రులదే కాదు, ప్రభుత్వానిదీ కాదా అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా విద్యా రంగంలో వ్యాపార ధోరణి పెరిగిందని, ముఖ్యంగా రాజకీయ నాయకులే విద్యాసంస్థలను నడపడం ఆందోళనకరమని పేర్కొన్నారు. తల్లిదండ్రుల బలహీనతను వ్యాపారంగా మార్చి ఫీజుల దోపిడీ జరుగుతోందని విమర్శించారు.

### హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌పై విమర్శలు

ప్రభుత్వ భూమిలో నడుస్తున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లోనే 120 శాతం ఫీజులు పెంచడం దురదృష్టకరమని అన్నారు. అదే పరిస్థితి ఇతర కార్పొరేట్ స్కూళ్లలో మరింత అధికంగా ఉండే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఆ స్కూల్ వ్యవహారంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని, ముఖ్యమంత్రి స్వయంగా సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. స్కూల్ భూములపై కుట్రలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా చేశారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆందోళన

ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని, దాదాపు 11 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఎంఎస్-7 జీవో ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో డబ్బులు వేయాలనడం సరైన విధానం కాదని విమర్శించారు. ఈ విధానం వల్ల తల్లిదండ్రులు పోరాటం చేసే అవకాశమే ఉండదని, విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు.

### సమగ్ర పోరాటానికి పిలుపు

ఫీజుల దోపిడీని అరికట్టేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఒక్కటిగా రావాలని కవిత పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహించాలని సూచించారు. తమ పార్టీ ఉచిత విద్య, ఉచిత వైద్యం అమలు చేస్తుందని, ఇచ్చిన మాట తప్పబోమని ఆమె స్పష్టం చేశారు. తమిళనాడు తరహాలో ఫీజుల నియంత్రణకు శాశ్వత అథారిటీ ఏర్పాటు చేయాలని లేదా గుజరాత్ మోడల్‌ను అనుసరించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాలతో ఏర్పడిందని, ఆ రాష్ట్రంలో ప్రజలకు న్యాయం జరిగేలా పాలన సాగాలని ఆమె పేర్కొన్నారు. విద్య, వైద్యం రంగాల్లో సమానత్వం, పారదర్శకత ఉండాలని కోరారు.

# అర్ధరాత్రి మహిళా పోలీస్ కమిషనర్ సంచలన ఆపరేషన్

చార్జ్ తీసుకున్న తొలి రోజే ఫీల్డ్‌లోకి దిగిన ఐపీఎస్ సుమతి

దిల్సుఖ్‌నగర్ బస్టాండ్‌లో ఒంటరిగా నిలబడి వాస్తవ పరిస్థితుల పరిశీలన





**హైదరాబాద్/ మేడ్చల్ మల్కాజ్గిరి బ్యూరో , వార్త సంధ్య, మే 06:** పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే అర్ధరాత్రి ఫీల్డ్‌లోకి దిగిన మహిళా కమిషనర్ సుమతి సంచలన చర్యలకు శ్రీకారం చుట్టారు. నగరంలో మహిళల భద్రతపై వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఆమె ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకుండా సాధారణ మహిళలా దిల్సుఖ్‌నగర్ బస్టాండ్‌కు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో బస్టాండ్‌కు చేరుకున్న సుమతి, అక్కడ సాధారణ మహిళగా బస్ కోసం ఎదురు చూస్తూ నిలబడ్డారు. తన అసలు గుర్తింపును బయటపెట్టకుండా, మహిళలకు ఎదురయ్యే ఇబ్బందులను ప్రత్యక్షంగా అనుభవించారు. ఈ సమయంలో సుమారు 40 మంది యువకులు ఆమె చుట్టూ గుమికూడి అసభ్యంగా ప్రవర్తించినట్లు సమాచారం. ఈ యువకుల్లో చాలా మంది విద్యార్థులే కాగా, కొందరు మద్యం, గంజాయి మత్తులో ఉన్నట్లు గుర్తించారు. రాత్రి 12 గంటల నుండి తెల్లవారుజామున 3 గంటల వరకు ఈ పరిస్థితిని గమనించినప్పటికీ, ఆ ప్రాంతంలో పర్యవేక్షణలో ఉన్న పోలీసులు స్పందించకపోవడం ఆందోళనకర అంశంగా మారింది. మూడు గంటల పాటు అక్కడ ఎవరూ జోక్యం చేసుకోకపోవడం పోలీసింగ్‌పై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయితే, పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ సుమతి ధైర్యంగా అక్కడే నిలబడి ప్రతి అంశాన్ని గమనించారు. చివరికి ఉదయం 3:30 గంటల సమయంలో అక్కడికి చేరుకున్న బీట్ కానిస్టేబుల్ పరిస్థితిని గుర్తించినట్లు సమాచారం. ఈ ఘటన అనంతరం కమిషనర్ సుమతి మూడు రోజుల పాటు దిల్సుఖ్‌నగర్ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో స్వయంగా నిఘా ఏర్పాటు చేసి, సమస్యకు మూల కారణాలను విశ్లేషించారు. ఆపై చర్యగా ఆ ప్రాంతంలో అల్లరి చేస్తున్న సుమారు 40 మంది యువకులను అదుపులోకి తీసుకుని, వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. చదువుకోవాల్సిన వయస్సులో ఉన్న విద్యార్థులు రాత్రి వేళల్లో ఇలాంటి పోకిరి చేష్టలకు పాల్పడటం ఆందోళన కలిగించే అంశమని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఆ ప్రాంతంలో ఎక్కువగా హాస్టల్స్ ఉండటం వల్ల ఈ తరహా ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని గుర్తించారు. ఈ సంఘటనతో నగరంలో మహిళల భద్రతపై మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టమైంది. పోలీసులు రాత్రి పర్యవేక్షణను బలోపేతం చేయడం, యువతలో అవగాహన పెంచడం అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# మా సొంత వాహనాల్లోనే వెళుతున్నాం, మా డబ్బుతోనే పర్యటిస్తున్నాం

నారా లోకేష్

టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులతో

'కాఫీ కబుర్లు' కార్యక్రమం

హాజరైన టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్

ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు

పనితీరు ఆధారంగానే పార్టీలో పదవులు..

పనిచేయకపోతే వేటేనని హెచ్చరిక

అహంకారం వీడి ప్రజల మనసులు

గెలిస్తేనే మళ్లీ గెలుస్తామన్న లోకేష్

కేడర్‌పై పెట్టిన అక్రమ కేసులన్నీ తొలగిస్తామని భరోసా




"ముఖ్యమంత్రి చంద్రబాబు, నేను ప్రభుత్వ పర్యటనలకు మా సొంత వాహనాలనే వినియోగిస్తున్నాం. వ్యక్తిగత విదేశీ పర్యటనలకు కూడా మా సొంత డబ్బునే ఖర్చు చేస్తున్నాం. మేము ప్రజలకు, పార్టీకి పూర్తి జవాబుదారీగా ఉంటున్నాం. కానీ ప్రత్యర్థులు పనిగట్టుకుని మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఫేక్ ప్రచారాన్ని వాస్తవ సమాచారంతో కార్యకర్తలు తక్షణమే తిప్పికొట్టాలి" అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పష్టం చేశారు. పార్టీ కేడర్ అత్యంత అప్రమత్తంగా ఉంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులతో నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో లోకేష్ పాల్గొని, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాయకులు, కార్యకర్తలు అహంకారం ప్రదర్శించకుండా ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. "గత ఎన్నికల్లో 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోవడానికి గొడ్డలి పార్టీ వారి అహంకారమే కారణం. మనం ఆ తప్పు చేయకూడదు. అహంకారం వీడి, సత్ప్రవర్తనతో, మంచి మాటలతో ప్రజల మనసులు గెలవాలి. అప్పుడు ప్రజలే మనల్ని మళ్లీ మళ్లీ గెలిపిస్తారు" అని హితవు పలికారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని లోకేష్ అన్నారు. "దేశంలోనే రూ.4 వేల పింఛను ఇస్తున్న ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్. 'తల్లికి వందనం' కింద విద్యార్థులకు రూ.15 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం. పోలవరం పూర్తికావొస్తోంది, అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ కొనసాగింపు రాష్ట్రానికి చాలా అవసరం" అని ఆయన వివరించారు. పార్టీలో పనితీరే కొలమానమని, ప్రతి నాయకుడి పనితీరును అధినేత చంద్రబాబు ప్రతి మూడు నెలలకోసారి సమీక్షిస్తారని లోకేష్ హెచ్చరించారు. "పనిచేయని వారి పదవులు ఊడతాయని చంద్రబాబు గారు మాతో నిర్మొహమాటంగా చెప్పారు. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకుని పనిచేయాలి. పార్టీలో ఇప్పుడు కోటరీలు లేవు. సామాన్య కార్యకర్త సైతం నేరుగా అధినేతను కలిసే అవకాశం ఉంది" అని తెలిపారు. పార్టీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ఏవైనా సమస్యలుంటే అంతర్గత వేదికలపైనే చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. "తెలుగుదేశంలో వ్యక్తులు కాదు, పార్టీయే శాశ్వతం. నాయకుల మధ్య విభేదాల వల్ల అంతిమంగా పార్టీ నష్టపోతుంది" అని అన్నారు. 2027 నాటికి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తానని, కేడర్‌పై పెట్టిన అక్రమ కేసులను పూర్తిగా తొలగిస్తామని, ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామని లోకేష్ భరోసా ఇచ్చారు. బీజేపీ వంటి పార్టీలు దీర్ఘకాలం అధికారంలో కొనసాగేందుకు అమలుచేస్తున్న విధానాలను అధ్యయనం చేస్తున్నామని, పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఒకే ఒక్క ఓటుతో ఓడిన మంత్రి, తమిళనాట సంచలనం!

మంత్రి పెరియకరుప్పన్‌కు చేదు అనుభవం

తిరుపత్తూరులో ఒక్క ఓటుతో గెలిచిన టీవీకే అభ్యర్థి

మంత్రికి 83,374, టీవీకే అభ్యర్థికి 83,375 ఓట్లు

ఫలితాన్ని హైకోర్టులో సవాలు చేసేందుకు డీఎంకే యోచన

2006 నుంచి ఓటమి ఎరుగని మంత్రికి తొలిసారి పరాజయం



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఊహించని సంచలనం నమోదైంది. రాష్ట్ర సహకార శాఖ మంత్రి, డీఎంకే సీనియర్ నేత కేఆర్ పెరియకరుప్పన్ కేవలం ఒక్క ఓటు తేడాతో ఓటమి పాలయ్యారు. శివగంగై జిల్లాలోని తిరుపత్తూరు నియోజకవర్గంలో ఆయనపై.. నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అభ్యర్థి శ్రీనివాస సేతుపతి చారిత్రక విజయం సాధించారు. ఓట్ల లెక్కింపులో చివరి వరకు తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అంతకుముందు రౌండ్లలో ఆధిక్యంలో ఉన్న పెరియకరుప్పన్‌కు తుది ఫలితం షాక్ ఇచ్చింది. అధికారులు ప్రకటించిన తుది లెక్కల ప్రకారం టీవీకే అభ్యర్థి శ్రీనివాస సేతుపతికి 83,375 ఓట్లు రాగా, మంత్రి పెరియకరుప్పన్‌కు 83,374 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి కేసీ తిరుమారన్ 29,054 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ ఫలితంతో తిరుపత్తూరులో 2006 నుంచి వరుసగా గెలుస్తూ వస్తున్న పెరియకరుప్పన్ 20 ఏళ్ల అజేయ ప్రస్థానానికి తెరపడింది. ఫలితం వెలువడిన వెంటనే రీకౌంటింగ్ నిర్వహించాలని డీఎంకే ఏజెంట్లు కోరినప్పటికీ అధికారులు నిరాకరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాన్ని మద్రాస్ హైకోర్టులో సవాలు చేసేందుకు డీఎంకే పార్టీ సిద్ధమవుతోంది. తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసిన టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలిచి, అతిపెద్ద సింగిల్ పార్టీగా అవతరించిన వేళ ఈ విజయం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

## కాంగ్రెస్‌లో గెలిచింది ఎక్కువమంది ముస్లింలే!

అసోంలో కాంగ్రెస్ గెలిచిన 19 సీట్లలో 18 మంది ముస్లిం అభ్యర్థులే

కేరళలో యూడీఎఫ్ కూటమి నుంచి గెలిచిన 30 మంది ముస్లిం ఎమ్మెల్యేలు

బెంగాల్‌లో కాంగ్రెస్ గెలిచిన రెండు స్థానాల్లోనూ ముస్లింలకే విజయం

కేరళ, అసోంలలో ముస్లిం అభ్యర్థుల గెలుపు శాతం 80గా నమోదు



ఇటీవల నాలుగు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆసక్తికర విశ్లేషణలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందిన అభ్యర్థులను పరిశీలిస్తే, వారిలో అత్యధిక శాతం ముస్లింలే ఉండటం గమనార్హం. అసోం, కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపించింది. అసోం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 19 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోగా, వీరిలో 18 మంది ముస్లిం అభ్యర్థులే విజయం సాధించారు. ఆ పార్టీ మొత్తం 20 మంది ముస్లింలకు టికెట్లు ఇవ్వడం విశేషం. ఇక కాంగ్రెస్ మిత్రపక్షమైన రాయిజోర్ దళ్ గెలిచిన ఇద్దరిలో ఒక ముస్లిం ఉన్నారు. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి అధికారంలోకి వచ్చింది. మొత్తం 140 స్థానాలున్న ఈ రాష్ట్రంలో వివిధ పార్టీల నుంచి 35 మంది ముస్లిం అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరిలో 30 మంది యూడీఎఫ్ కూటమి నుంచే ఉండటం గమనార్హం. ఈ 30 మందిలో 8 మంది కాంగ్రెస్ అభ్యర్థులు కాగా, మిగిలిన 22 మంది మిత్రపక్షాలకు చెందినవారు. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ గెలుపొందిన రెండు స్థానాల్లోనూ ముస్లిం అభ్యర్థులే జయకేతనం ఎగురవేశారు. ఇక్కడ పార్టీ 63 మంది ముస్లింలకు టికెట్లు ఇచ్చింది. తమిళనాడులో పొత్తులో భాగంగా రెండు సీట్లు ముస్లింలకు కేటాయించగా, ఒకరు గెలుపొందారు. కేరళ, అసోం రాష్ట్రాల్లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నిలబెట్టిన ముస్లిం అభ్యర్థుల్లో గెలుపు శాతం 80గా ఉంది.

# తమిళనాట తెలుగులో ప్రచారం ప్రశాంత్ కిశోర్ టీమ్ నుంచి అసెంబ్లీకి

శివకాశి ఎమ్మెల్యేగా కీర్తన సంచలనం!

తమిళనాట తెలుగులో ప్రసంగించి ఎమ్మెల్యేగా గెలిచిన కీర్తన

విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ తరపున శివకాశి నుంచి విజయం

గతంలో ప్రశాంత్ కిశోర్ బృందంలో, టీడీపీ సోషల్ మీడియా విభాగంలో సేవలు

స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి

శివకాశి నియోజకవర్గానికి తొలి మహిళా ఎమ్మెల్యేగా రికార్డు



తమిళనాడు రాజకీయాల్లో నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ సృష్టించిన సంచలనాలు కొనసాగుతున్నాయి. ఎందరో సామాన్యులను అసెంబ్లీకి పంపిన ఆ పార్టీ నుంచి ఇప్పుడు మరో ఆసక్తికరమైన విజేత కథ వెలుగులోకి వచ్చింది. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని ఒక యువతి, ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బృందంలో పనిచేసిన అనుభవంతో తన నియోజకవర్గంలో తెలుగులో ప్రసంగించి మరీ ఓటర్ల మనసులు గెలుచుకున్నారు. ఆమే విరుద్‌నగర్ జిల్లా శివకాశి నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే కీర్తనా సంపత్. వ్యూహకర్త నుంచి ప్రజా ప్రతినిధిగా..కీర్తనా సంపత్ ప్రస్థానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. పాండిచ్చేరి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ పూర్తి చేసిన ఆమె, డేటా అనలిస్ట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. తన ప్రతిభతో దేశంలోనే ప్రముఖ రాజకీయ వ్యూహకర్తగా పేరుగాంచిన ప్రశాంత్ కిశోర్ (ఐప్యాక్) బృందంలో చేరారు. గోవా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ఎన్నికల్లో తెరవెనుక వ్యూహరచనలో కీలక పాత్ర పోషించారు. 2021 తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ గెలుపు కోసం కూడా పనిచేశారు. ఆ తర్వాత హైదరాబాద్ కేంద్రంగా టీడీపీ సోషల్ మీడియా విభాగానికి ఆమె నాయకత్వం వహించారు. ఈ క్రమంలోనే ఆమెకు తెలుగు భాషపై మంచి పట్టు లభించింది. సొంతూరి సమస్యలపై పోరాటందేశవ్యాప్తంగా ఎందరో నేతల గెలుపు కోసం వ్యూహాలు రచించిన కీర్తనను తన సొంత ప్రాంతంలోని సమస్యలు తీవ్రంగా ఆలోచింపజేశాయి. బాణాసంచా పరిశ్రమకు కేంద్రమైన శివకాశిలో తరచూ జరిగే అగ్ని ప్రమాదాలు, కార్మికుల మరణాలు ఆమెను కలచివేశాయి. తాగునీరు, సరైన రోడ్లు, వైద్య సదుపాయాలు వంటి కనీస మౌలిక వసతులు లేకపోవడం, ఉన్నత చదువులు చదివిన యువత ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లడం లేదా స్థానికంగా టాక్సీ డ్రైవర్లుగా మిగిలిపోవడం వంటి అంశాలు ఆమెను రాజకీయాల వైపు నడిపించాయి. దీంతో లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలి సొంతూరికి తిరిగి వచ్చారు. విజయ్ అవకాశం.. తెలుగులో ప్రచారం.. చారిత్రక విజయంసొంతూరికి వచ్చిన కీర్తన.. సోషల్ మీడియా ద్వారా స్థానిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థలతో కలిసి విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తూ చాలా తక్కువ సమయంలోనే ప్రజల మన్ననలు పొందారు. ఆమె ప్రజాదరణను గమనించిన టీవీకే అధినేత విజయ్, ఎన్నికలకు కేవలం నెల రోజుల ముందు ఆమెకు శివకాశి టికెట్ కేటాయించారు. ప్రచారంలో తనదైన ముద్ర వేసిన కీర్తన, నియోజకవర్గంలోని తెలుగు ఓటర్లను ఆకట్టుకోవడానికి తెలుగులో ప్రసంగించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆమె వినూత్న ప్రచార శైలి, స్థానిక సమస్యలపై ఆమెకున్న అవగాహన ఓటర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఫలితంగా ఆమె ప్రత్యర్థులపై భారీ మెజార్టీతో విజయం సాధించారు. అంతేగాక శివకాశి నియోజకవర్గ చరిత్రలోనే తొలి మహిళా ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించారు. ఒక డేటా అనలిస్ట్ ప్రజా ప్రతినిధిగా మారిన ఆమె కథ, యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

## యూట్యూబ్ లో పరిశోధించి మరీ భార్యను చంపాడు!

భార్యను హత్య చేసిన కేసులో ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి అరెస్ట్

ఆన్‌లైన్‌లో వెతికి హత్యకు పక్కా ప్రణాళిక రచించిన నిందితుడు

స్వీట్‌లో విషం కలిపి, తలగడతో ఊపిరాడకుండా చేసి హత్య

లావుగా ఉందనే కారణంతో హత్య చేశానని నిందితుడి వాంగ్మూలం



ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. కట్టుకున్న భార్యను కిరాతకంగా హత్య చేసిన కేసులో ఆమె భర్త భద్రిపల్లి కిరణ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హత్య చేయడానికి ముందు "భార్యను ఎలా చంపాలి?" అని ఇంటర్నెట్‌లో వెతికి మరీ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలడం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రొద్దుటూరు ఎఎస్పీ విబూ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఈశ్వర్ నగర్‌లో నివాసం ఉంటున్న కిరణ్ కుమార్, తన భార్య పద్మజ (31)ను ఏప్రిల్ 29న హత్య చేశాడు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో వెతికి, హైదరాబాద్ నుంచి విషాన్ని తెప్పించాడు. ఆ విషాన్ని పాలకోవ స్వీట్‌లో కలిపి భార్యకు ఇచ్చాడు. ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిన తర్వాత, చనిపోయిందని నిర్ధారించుకోవడానికి తలగడతో ఊపిరాడకుండా చేసి చంపేశాడు. భార్య లావుగా ఉందని, శుభ్రత పాటించడం లేదనే కారణంతోనే హత్య చేసినట్లు నిందితుడు మొదట పోలీసులకు తెలిపాడు. అయితే, పోలీసుల దర్యాప్తులో మరో కోణం బయటపడింది. నిందితుడికి ఒక సహోద్యోగితో వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయం తెలిసి భార్య నిలదీయడంతో ఆమెను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు, పోస్టుమార్టం నివేదికలో విషప్రయోగం జరిగినట్లు తేలడంతో హత్య కేసుగా మార్చారు. ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేసుకున్న ఈ దంపతులకు ఏడేళ్ల కుమార్తె ఉంది. నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు నిన్న మీడియాకు వెల్లడించారు.

## నటుడు విజయ్‌కు ఊహించని మద్దతు

చక్రం తిప్పుతున్న అన్నాడీఎంకే!

మెజారిటీకి కొన్ని సీట్ల దూరంలో నిలిచిన టీవీకే

టీవీకేకు బయటి నుంచి మద్దతు ఇచ్చే ఆలోచనలో అన్నాడీఎంకే

చెన్నైలో సమావేశం కానున్న పార్టీ ఎమ్మెల్యేలు

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, మెజారిటీకి కొద్ది దూరంలో నిలిచిపోయిన నటుడు విజయ్ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే)కు అన్నాడీఎంకే బయటి నుంచి మద్దతు ఇచ్చే అవకాశం ఉందన్న వార్తలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం చెన్నైలో అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు కీలక సమావేశం నిర్వహిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలు ఉండగా, ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఎన్నికల్లో టీవీకే 108 స్థానాల్లో గెలుపొందింది. అతిపెద్ద పార్టీగా అవతరించినందున, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ టీవీకేను ఆహ్వానించే అవకాశం ఉంది. అయితే, ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశాక విజయ్ సభలో తన బలాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. విజయ్ రెండుచోట్ల గెలిచినందున, ఒక స్థానాన్ని వదులుకోవాల్సి వస్తుంది. దీంతో టీవీకే బలం 107కు తగ్గుతుంది. ఈ లెక్కన మెజారిటీ నిరూపించుకోవాలంటే కనీసం 11 నుంచి 12 మంది ఎమ్మెల్యేల మద్దతు టీవీకేకు తప్పనిసరి. ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన టీవీకేకు ఏ పార్టీతోనూ పొత్తు లేదు. దీంతో డీఎంకే, అన్నాడీఎంకే కూటముల్లోని పార్టీలతో తెరవెనుక చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా, డీఎంకే కూటమిలోని కాంగ్రెస్ (5 సీట్లు), అన్నాడీఎంకే కూటమిలోని పీఎంకే (4 సీట్లు) విజయ్‌కు మద్దతిచ్చేందుకు సుముఖంగా ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఫలితాల తర్వాత రాహుల్ గాంధీ విజయ్‌కు ఫోన్ చేసి అభినందించడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. ఒకవేళ చిన్న పార్టీలపై ఆధారపడకుండా అన్నాడీఎంకే బయటి నుంచి మద్దతు ఇస్తే, విజయ్ ప్రభుత్వం మరింత పటిష్ఠంగా ఉంటుంది. మంత్రి పదవులు వంటి అంశాల్లో చిన్న పార్టీల నుంచి ఒత్తిళ్లు లేకుండా, పాలనపై పూర్తి నియంత్రణ సాధించే అవకాశం విజయ్‌కు లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అన్నాడీఎంకే సమావేశంలో తీసుకోబోయే నిర్ణయం తమిళనాడు రాజకీయ భవిష్యత్తును నిర్దేశించనుంది.

# రాముడి వంశీకులమని కొందరు ఎందుకు చెప్పుకుంటున్నారు ?

## చరిత్ర, పురాణాల్లో ఏముంది



"ఇక్ష్వాకు కుల తిలకా.. ఇకనైన పలుకవే రామచంద్రా.." అంటూ సాగే భక్త రామదాసు కీర్తన తెలుగు వారికి బాగా పరిచితం. రాముణ్ణి తరచుగా ఇక్ష్వాకు వంశీకుడిగా పురాణాల్లో వర్ణిస్తూ ఉంటారు. తాజాగా మరోసారి ఇక్ష్వాకు వంశం పేరు వార్తల్లోకి వచ్చింది."భూమండలం అంతా ఇక్ష్వాకులదా కాదా? ఇక్ష్వాకుల గోత్రం ఏంటి?" అంటూ చిలుకూరు బాలాజీ ఆలయ పూజారి రంగరాజన్‌ను బెదిరిస్తూ 'రామరాజ్యం' సంస్థకు చెందిన వీర రాఘవ రెడ్డి మాట్లాడిన వీడియో ఈ మధ్య వైరల్ అయింది."ఇక్ష్వాకుల గోత్రం కూడా నీకు తెలియదు" అంటూ రంగరాజన్‌ను విమర్శించారు రాఘవ రెడ్డి.ఇంతకీ ఎవరీ ఇక్ష్వాకులు? ఏంటి వారి వంశం? అనేవి అర్థం కావాలంటే మూడు విషయాలు తెలియాలి. ఈ పదం మూడు చోట్ల ప్రముఖంగా వినిపిస్తుంది.హిందూ పురాణాల ప్రకారం రాముడి వంశాన్ని ఇక్ష్వాకు వంశం అంటారు. సూర్యుడి నుంచి ఆ వంశం ఏర్పడింది కాబట్టి సూర్య వంశం అని, రఘు అనే గొప్ప మహారాజు కూడా ఆ వంశీకుడే కాబట్టి రఘువంశం అని కూడా అంటారు.పురాణాల ప్రకారం.. రాముడి వంశంలో మొట్టమొదటి పాలకుడు అంటే అయోధ్య రాజధానిగా కోసల రాజ్యాన్ని పాలించిన వ్యక్తి ఇక్ష్వాకుడు. ఆ ఇక్ష్వాకుడు వైవస్వత మనువు కొడుకు. అలా వారి క్రమంలో 80వ రాజు రాముడు.ముచుకుంద, అంబరీష, భరత, బాహుబలి, హరిశ్చంద్ర, దిలీప, సగర, రఘు, దశరథ...ఇలా వీరంతా రాముడి కంటే ముందు ఇక్ష్వాకు వంశపు రాజులు."శ్రీరాముని వంశ వృక్షాన్ని రఘువంశ మహాకావ్యంలో వర్ణించారు. అది కాళిదాసు రాసిన



సంస్కృత మహా కావ్యం. ఇక ఇక్ష్వాకుల వంశ మొదటి రాజుగా ఇక్ష్వాక చక్రవర్తే ఉంటారు. ఇక్ష్వాకు వంశంలో చివరి రాజుగా బృహద్బలుడి పేరు కనిపిస్తుంది. ఆయనే మహాభారతంలో కూడా కనిపిస్తారు. బృహద్బలుడు కౌరవుల తరపున భారత యుద్ధంలో పాల్గొన్నాడు" అని వాస్తు జ్యోతిష్య పండితులు, ఆధ్యాత్మికవేత్త పాలెపు రాజేశ్వర శర్మ బీబీసీతో చెప్పారు.రామాయణంతో పాటు వేదాల్లో కూడా ఇక్ష్వాకు పదం ప్రస్తావన ఉంది. వీటన్నింటిని హిందువుల విశ్వాసాలతో పాటు రామాయణం, భాగవతం, ఇతర పురాణాలు, రఘువంశం కావ్యం పేర్కొన్నాయి.హిందూ గ్రంథాలతో సంబంధం లేకుండా చారిత్రక ఆధారాలను బట్టి చూస్తే, భారతదేశంలో కొన్ని రాజ కుటుంబాలు ఈ పేరును ఉపయోగించుకున్నాయి.అయోధ్య ప్రాంతాన్ని క్రీస్తు పూర్వం 530 ప్రాంతంలో పాలించిన ప్రసేన్‌జిత్ అనే రాజు ఇక్ష్వాకు వంశీకుడని, అలాగే క్రీస్తు పూర్వం 345 ప్రాంతంలో పాలించిన సుమిత్రుడనే రాజు సూర్య వంశీకుడని చెప్పుకున్నట్టు కొందరు చరిత్రాకారులు రాశారు.అయితే ఈ ఇద్దరూ హిందూ పురాణాల్లోని ఇక్ష్వాకు వంశీకులే అనడానికి స్పష్టమైన ఆధారం లేదు.తెలుగునాట కూడా ఓ రాజ వంశానికి ఈ పేరు ఉంది. కృష్ణా నదీ తీరంలో శాతవాహనుల తరువాత పాలించిన రాజులు ఆంధ్ర ఇక్ష్వాకులు. వీళ్లనే విజయపురి ఇక్ష్వాకులు అని కూడా అంటారు.క్రీస్తు శకం 3-4 శతాబ్దాల్లో వీరు పాలించారని ఎక్కువ మంది చరిత్రకారులు చెప్పారు. ప్రస్తుత పల్నాడు జిల్లా మాచర్ల దగ్గర నాగార్జునకొండ వీరి రాజధాని. ఆంధ్ర, తెలంగాణల్లో పలు ప్రాంతాలను వీరు పాలించారు.రాముడి గురించి చెప్పే ఇక్ష్వాకు వంశానికీ వీరికీ సంబంధం ఉన్నట్టు పురాణపరంగా గానీ, చరిత్రపరంగా గానీ ఆధారాలు లేవు."శాతవాహనుల తరువాత ఆంధ్ర ఇక్ష్వాకులు తెలుగునేలను పాలించారు. హిందూ పురాణాల్లో ఇక్ష్వాకులు, వీరూ ఒకరని చెప్పడానికి ఏ ఆధారమూ లేదు" అని చరిత్రకారులు శ్రీరామోజు హరగోపాల్ బీబీసీతో చెప్పారు."నేటికి 2500 ఏళ్ల క్రితమూ, 1700 సంవత్సరాల కిందటా పాలించిన కొందరు రాజులు తమను తాము ఇక్ష్వాకులు అని చెప్పుకున్నారు. కానీ చరిత్రలోని ఇక్ష్వాకులు, పురాణాల్లోని ఇక్ష్వాకులు ఒకరే అని చెప్పే ఆధారాలు లేవు. అసలు హిందూ పురాణాల్లో ఇక్ష్వాకులుగా చెబుతున్నవారు నిజంగా చరిత్రలో ఉన్నారా? అనే దానికి సైతం స్పష్టమైన ఆధారాలు లేవు. ఇక ఇన్ని వందల సంవత్సరాల తరువాత ఇక్ష్వాకు వంశం వారు ఇంకా ఉన్నారా అంటే సాక్ష్యాలు, ఆధారాలు ఉండవు" అంటున్నారు చరిత్రకారులు హరగోపాల్.జైన సాహిత్యంలోని స్వయంభూ స్తోత్రంలో 1-3-3 శ్లోకంలో 'భగవంతుడైన రిషభదేవుడు ఇక్ష్వాకు వంశానికి మొదటి రాజు' అని రాశారు. ఆయన్నే ఇక్ష్వాకుడు అని జైనులు పిలుస్తారు.రిషభదేవుడు లేదా రిషభనాథుడు జైనుల్లో మొదటి తీర్థంకరుడు. ఈయన్ను జైన మత స్థాపకుడిగా పరిగణిస్తారు.ఇక బౌద్ధంలో కూడా ఇక్ష్వాకు వర్ణనలు ఉన్నాయి. భారత్‌తో పాటు టిబెట్ బౌద్ధ సంప్రదాయాల్లో ఇక్ష్వాకుకు సమానార్థకమైన పదాలతో రాజ వంశాల వర్ణన బౌద్ధ సాహిత్యంలో కనిపిస్తుంది.

### ఇక్ష్వాకులు ఇప్పుడు ఉన్నారా?

"ఏ కులం వారైనా ఇక్ష్వాకులు అని చెప్పడానికి ఏ ఆధారమూ లేదు. ఇక్ష్వాకు వంశం ఇప్పటి వరకూ కొనసాగి, ఆ వంశం వారు ఎవరో ఒకరు ఇంకా ఉన్నారనడానికి చెప్పే అవకాశం లేదు. ఎవరైనా చెప్పుకున్నా దానికి సాక్ష్యం ఉండదు. ఈ మధ్య కాలంలో చాలామంది తమ కులం, కుటుంబ గతం ఘనమైనది అని చెప్పుకునే క్రమంలో రాజరికాన్ని ఆపాదించుకుంటున్నారు. వారికి నిజంగా ఘన చరిత్ర ఉందా లేక లేనిదాన్ని ఘనంగా చెప్పుకుంటున్నారా అన్నది చూడాలి" అన్నారు హరగోపాల్."ఒకసారి ఒకరు రాజరికం పొందాక తమను తాము కాని, లేదా వారి ఆస్థానంలోని వారు కాని ఈ రాజులకు దైవత్వం ఆపాదించడం, సూర్య, చంద్ర వంశాల వారంటూ కీర్తించడం భారత చరిత్రలో బాగా కనిపిస్తుంది. దీన్నే శాసనాల్లో, గ్రంథాల్లో రాజ ప్రశస్తి అంటారు" అని శ్రీరామోజు హరగోపాల్ చెప్పారు.

# ఆదాయాన్నిచ్చే రిజిస్ట్రేషన్ వ్యవస్థపై మరింత శ్రద్ధ

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమైన మూడవ అతిపెద్ద (11శాతం వాటా) ఆదాయాన్ని ఆర్జించే విభాగం రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల విభాగం. 1864 సంవత్సరం నుండి పనిచేస్తున్న ఈ శాఖ....**

**ఆదాయాన్నిచ్చే? రిజిస్ట్రేషన్ వ్యవస్థపై మరింత శ్రద్ధ**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమైన మూడవ అతిపెద్ద (11శాతం వాటా) ఆదాయాన్ని ఆర్జించే









విభాగం రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల విభాగం. 1864 సంవత్సరం నుండి పనిచేస్తున్న ఈ శాఖ లక్ష్యం ఆస్తులకు రిజిస్టర్డ్ పత్రాల ద్వారా హక్కు కల్పించి రక్షించడం. స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల ద్వారా ఈ విభాగం రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని సేకరిస్తోంది. కానీ ప్రస్తుత రిజిస్ట్రార్ కార్యాలయాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. అనేక కార్యాలయాలు అద్దె భవనాలలో కనీస సౌకర్యాలు కూడా లేకుండా కొనసాగుతున్నాయి. విజయవాడ నగరంలో అత్యధిక రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయం అయిన పటమట రిజిస్టర్ ఆఫీసులో కనీసం తాగునీరు కూడా సరిగ్గా దొరకదు.రిజిస్ట్రార్ ఆఫీసుల్లో దస్తావేజుకు రూ.500 యూజర్స్ చార్జెస్ వసూలు చేస్తున్న పరిస్థితి ఉన్నది. ఈ ఛార్జీల ద్వారా లభించే ఆదాయాన్ని కూడా రిజిస్ట్రేషన్ శాఖ ప్రయోజనాల కోసం వాడటం లేదు. దస్తావేజు రైటర్స్ వ్యవస్థకు మరో మంచి ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయగలిగితే దళారీల పాత్రను తగ్గించవచ్చు. పూర్వం లాగే డాక్యుమెంట్ రైటర్లకు లైసెన్సులు ఇవ్వాలి. రిజిస్ట్రేషన్ సేవలు పొందే సమయంలో ప్రజలు కార్యాలయాల వద్ద ఎండలో, వానలో రోడ్ల మీద వేచి చూడాల్సిన పరిస్థితి ఉన్నది. ఈ ఆఫీసులలో కనీస సౌకర్యాలను తక్షణం పెంచాలి. రాష్ట్ర ఆదాయంలో ముఖ్య పాత్ర పోషించే రిజిస్ట్రేషన్ ఆఫీసులను మెరుగుపరచాలి.రాష్ట్రానికి నిర్దిష్ట ఏపీ స్టాంప్ చట్టం అవసరం. కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు తమ రాష్ట్ర చట్టానికి సవరణ ద్వారా అదనపు ఆదాయాన్ని సేకరించేందుకు వీలుగా స్వంత స్టేట్ స్టాంప్ చట్టాన్ని కలిగి ఉన్నాయి. కానీ మనం ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వ చట్టాన్ని అమలు చేస్తున్నాం. ఇండియన్ స్టాంప్ చట్టం 1899 నాటిది కాబట్టి పార్లమెంటు అనుమతి లేకుండా మేము సవరించలేకపోతున్నాం అని రిజిస్ట్రేషన్ శాఖ చెపుతుంది. ప్రభుత్వం దీనిపై సమీక్ష జరపాలి. ఏపీ కోసం కొత్త స్టాంప్ చట్టాన్ని తీసుకురావాలి.రాష్ట్ర ఖజానాకి భవిష్యత్తులో సంవత్సరానికి అదనంగా దాదాపు రూ.1000కోట్లు రాబడి తేవాలంటే రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌కు నిర్దిష్ట స్టాంప్ చట్టం అవసరం. దీనిని ప్రజలపై పన్ను భారంగా భావించరాదు. అట్లాగే కొత్త భవన నిర్మాణాలకు యూజర్ చార్జీలు కింద వసూలయ్యే మొత్తంలో కొంత వినియోగించుకోవాలి. రాష్ట్రంలో మొత్తం రిజిస్ట్రార్ కార్యాలయాలు 294 కాగా వీటిలో దాదాపు సగం భవనాలు అద్దె భవనాలలోనే ఉన్నాయి. రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్న ప్రభుత్వ భవనాలు కూడా శిథిలమైన స్థితిలో ఉన్న పరిస్థితి. అద్దె భవనాలు కూడా సరైన సౌకర్యాలతో సక్రమంగా లీజుకు తీసుకోబడలేదు. అలానే రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులు 2500కు గానూ ప్రస్తుతం సుమారు 1800 మాత్రమే ఉన్నారు. ఉద్యోగుల కొరత కారణంగా ఈ ఆఫీసులలో అనధికారిక వ్యక్తుల ప్రమేయం పెరుగుతున్నది. స్కానింగ్, కేవైసీ ఆధార్ సీడింగ్ మొదలైన వాటి కోసం ప్రైవేట్ వ్యక్తులపై ఆధారపడవలసి వస్తోంది. అడ్వాన్స్‌డ్ కంప్యూటర్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లేదు. ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడేందుకు సిబ్బందికి సరైన శిక్షణ లేదు. చిన్న చిన్న సర్వర్ సమస్యల కోసం ప్రైవేట్ కాంట్రాక్టర్లపై ఆధారపడాల్సి వస్తున్నది. దీనివల్ల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన సాధారణ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.ఈ - స్టాంప్ విధానం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకుంది. స్టాంప్‌ల కొరత, నకిలీ స్టాంప్‌ల విక్రయం, ట్యాంపరింగ్.. వంటి సమస్యలకు ఈ-%-%స్టాంప్ చెక్ పెడుతుందంటున్నారు అధికారులు. నాన్ జ్యుడిషియల్‌కు ఉన్న చట్టబద్ధత ఈ -స్టాంపుకూ ఉంటుంది. స్టాంప్ వెండర్లతో పాటు కామన్ సర్వీస్ సెంటర్లలో ఈ%-%-స్టాంప్‌లు అందుబాటులో ఉంటాయి. తమకు ఎంతో కొంత కమిషన్ వచ్చేలా చూస్తే కొత్త విధానం ఎంతో బాగుంటుందని స్టాంప్ వెండర్లు చెబుతున్నారు. స్టాంప్ పేపర్ల తయారీ ఖర్చు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశముంది.గత ప్రభుత్వ హయంలో రిజిస్ట్రేషన్ శాఖలో చోటుచేసుకున్న చలానాల కుంభకోణాన్ని ఛేదించే క్రమంలో ఆశ్చర్యగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. కడప సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ కుంభకోణం మొదట వెలుగుచూసింది. రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2018 నుంచి ఆన్‌లైన్ ద్వారా అప్లోడ్ చేసిన చలాన్లను అధికారులు పరిశీలించి దాదాపు అన్ని జిల్లాల్లోనూ అవకతవకలు ఉన్నట్లు గుర్తించారు. ప్రజల వెసులుబాటు కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన సీఎంఎఫ్ఎస్ విధానం అక్రమార్కులకు అందివచ్చిన అవకాశంగా మారింది. ఈ విధానంలో కంప్యూటర్ ద్వారా వచ్చే చలానాలపై అధికారుల ధ్రువీకరణ సంతకాలు, సీళ్లు ఉండవు. నకిలీ చలానాలు సృష్టించడానికి ఇది అనువుగా మారింది. చలానా కట్టిన అనంతరం రిజిస్ట్రేషన్ చెల్లింపు మొత్తాన్ని ఎడిట్ చేసుకునే సాంకేతిక పరిజ్ఞానాన్ని అక్రమార్కులు వాడుకున్నారని ప్రచారం జరుగుతోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రైటర్స్‌గా పనిచేసిన వ్యక్తులే కోట్లాది రూపాయల ప్రభుత్వాదాయానికి గండి కొట్టారని పోలీసులు గుర్తించారు. కృష్ణా జిల్లా మండవల్లి, నెల్లూరు జిల్లా నాయుడుపేట, పశ్చిమగోదావరి జిల్లా తణుకు, కర్నూలు జిల్లా నంద్యాల, గుంటూరు జిల్లా మంగళగిరి, విజయవాడ గాంధీనగర్, విశాఖ జిల్లా లంకెలపాలెం వంటి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు నకిలీ చలానాలను, నగదును స్వాధీనం చేసుకున్నారు.గత వైసీపీ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా గ్రామ సచివాలయాల ద్వారా ఆస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టింది. ఈ విధానం ద్వారా ప్రజల కష్టాలు పూర్తిగా తీరిపోతాయని చెబుతూ%-% సచివాలయ ఉద్యోగులకు సరైన శిక్షణ ఇవ్వకుండా, అరకొర సదుపాయాలతో ఈ కార్యక్రమం ప్రారంభించారు. అయితే ఈ ప్రయోగాల వల్ల గ్రామ సచివాలయంలోని ఉద్యోగులపై ఒత్తిడి పెరిగింది తప్ప మరే సత్ఫలితమూ సమకూరలేదు. గత రెండున్నర ఏళ్ల కాలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కేవలం 110 ఆస్తుల రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లను పూర్తిగా రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ స్టాంపుల విభాగంలో లోపాలను, లొసుగులను పూర్తిగా ప్రక్షాళన చేస్తుందని, కనీస సౌకర్యాలు మెరుగుపరుస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు. సుదీర్ఘ పాలనానుభవం, దక్షత ఉన్న చంద్రబాబునాయుడి ద్వారానే రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణలు సాధ్యమని ప్రజలు భావిస్తున్నారు.

# 'ఉప్పు' తక్కువగా తీసుకుంటున్నారా

**మీ శరీరంలో జరిగే మార్పులివే!**

**ఉప్పు అన్నింటికీ ముప్పే**

**గుండె, కిడ్నీల ఆరోగ్యం మెరుగుపడుతుందంటున్న నిపుణులు!**



"వంటల్లో అన్నీ వేసి చూడండి, నన్ను వేసి చూడండి" అంటుందట ఉప్పు. వంటల రుచిలో ఉప్పుదే సింహభాగం. కానీ, అది కాస్త తక్కువైతే పర్లేదు కానీ, ఏ మాత్రం ఎక్కువైనా ఆ పదార్థాలు పక్కన పెట్టేయాల్సిందే. ఉప్పు శరీరంలోని ద్రవ స్థాయిలను నియంత్రిస్తుంది. నరాల సంకేతాలను ప్రసారం చేస్తుంది. కండరాల సంకోచం, సడలింపులో సహాయపడుతుంది. రక్తపోటు, ప్లాస్మా పరిమాణాన్ని నిర్వహించడానికి కూడా ఉప్పు చాలా అవసరం. కానీ, ఉప్పు మితిమీరితే మాత్రం ఆరోగ్యానికి ముప్పు తప్పదంటున్నారు నిపుణులు. అందుకే, ఉప్పు తీసుకునే పరిమాణంలో నియంత్రణ కలిగి ఉండాలని చెబుతున్నారు.ఈ క్రమంలో ఉప్పు తక్కువగా తీసుకుంటే మనం ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందో? వ్యాధుల ముప్పు ఎలా తగ్గుతుందో? ఇప్పుడు తెలుసుకుందాం!ప్రతి ఒక్కరూ ఉప్పు విషయంలో నియంత్రణ కలిగి ఉండాలి. కానీ, చాలామంది సిఫార్సు చేసిన దానికంటే ఎక్కువగానే తీసుకుంటున్నారు. ఫలితంగా అనేక రకాల ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో పెద్దలు రోజుకు 2000 మిల్లీగ్రాముల కంటే తక్కువ సోడియం (రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పుతో సమానం) లేదా ఒక టీస్పూన్ కంటే కొంచెం తక్కువ తీసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) సిఫార్సు చేస్తోంది. ఎందుకంటే, ఉప్పు వినియోగం పెరిగినప్పుడు, అది గుండె, రక్తపోటు, మూత్రపిండాలు, ఇతర అవయవాలపై ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. అందుకే, ఉప్పు తీసుకోవడం తగ్గించడం చాలా ముఖ్యం.అధిక ఉప్పు వల్ల శరీరం నీటిని నిలుపుకుంటుంది. దీనివల్ల రక్త పరిమాణం పెరిగి గుండెపై అదనపు భారం పడుతుందంటున్నారు నిపుణులు. ఇది రక్తపోటును పెంచి, ధమనులపై ఒత్తిడి కలిగించి హైపర్ టెన్షన్‌కు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ఉప్పును తక్కువగా తీసుకోవడం వల్ల రక్త నాళాలు సడలి, రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. రక్తపోటు స్థిరంగా ఉంటుంది. ఉప్పును కొద్దిగా తగ్గించినా త్వరగా ఫలితాలు కనిపిస్తాయట. తలనొప్పి తగ్గడం, మంచి నిద్ర, మైకం తగ్గడాన్ని మీరు గమనించవచ్చు. దీర్ఘకాలంలో ఇది స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని, రక్త నాళాల దెబ్బతినకుండా కాపాడుతుందని ఎౖఅవఅఎవఎఙఅతీవష్ పేర్కొంది.ఉప్పు ఎక్కువగా తీసుకుంటే, అది రక్త నాళాల పొరలను దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు. ఇది ధమనులలో కొవ్వు పేరుకుపోవడానికి దారితీస్తుందని చెబుతున్నారు. దీనివల్ల ధమనులు మూసుకుపోయి గుండెకు ఆక్సిజన్ అందదు. ఇది కాలక్రమేణా గుండె కండరాలను బలహీనపరుస్తుంది. ఈ క్రమంలో తక్కువ ఉప్పు ఉన్న ఆహారం గుండెపై ఒత్తిడిని తగ్గించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. గుండె లయను స్థిరీకరిస్తుంది. వంటల్లో ఉప్పును తక్కువగా వాడే వారిలో గుండెపోటు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. దీనివల్ల గుండె మరింత సమర్థవంతంగా పనిచేస్తుంది. హృదయ సంబంధ ఆరోగ్యానికి మాత్రమే కాకుండా మూత్రపిండాల వ్యాధిని నివారించడానికి, నిర్వహించడానికి కూడా ఉప్పు తగ్గించాలని టతీశీత్‌అవతీంఅఅ పేర్కొంది.ఉప్పు ఎక్కువైతే శరీరంలో ద్రవాలు పేరుకుపోవడం, వాపులు రావడం, మూత్రం ద్వారా ప్రోటీన్ బయటకు పోవడం వంటివి జరుగుతాయి. దీర్ఘకాలికంగా ఉప్పును అధికంగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఉప్పు తగ్గించడం వల్ల ఈ భారం తగ్గుతుందని చెబుతున్నారు.అధిక ఉప్పు హైడ్రేషన్‌కు అంతరాయం కలిగిస్తుంది. దీనివల్ల ముఖం ఉబ్బడం, దాహం, నీటి నిలుపుదల వల్ల అలసట కలుగుతుందంటున్నారు నిపుణులు. మీరు తగినంత నీరు తాగినప్పటికీ, కణాలు వాపునకు గురై డీహైడ్రేషన్ లక్షణాలు కనిపిస్తాయని చెబుతున్నారు. ఉప్పు తగ్గించడం వల్ల ఈ సమతుల్యతను తగ్గిపోతుందని తెలియజేస్తున్నారు. ముఖం, అవయవాల వాపు తగ్గుతుందట. శక్తి స్థాయిలు పెరగడంతో పాటు చర్మం మెరుస్తూ, మైగ్రేన్ వంటి సమస్యలు తగ్గుతాయి.ఉప్పు తగ్గించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం మెరుగుపడుతుందంటున్నారు నిపుణులు. ఇది కడుపు అల్సర్లు లేదా కాలేయ ఒత్తిడి వంటి సమస్యలకు కారణమయ్యే శరీర వాపులను తగ్గిస్తుందని చెబుతున్నారు. రక్తపోటు మందులు వంటి ఔషధాల పనితీరును ఇది మెరుగుపరుస్తుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మానసిక పరంగా చూస్తే, మెదడుకు స్థిరమైన రక్త ప్రసరణ జరగడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

# మొక్కలు, పూలు, కుండీల మాటున వచ్చే జంతువులతో ఎంత ప్రమాదమో తెలుసా?



కప్పలు, బల్లులు, పాములు, సాలెపురుగులు, ఇతర క్రిమి కీటకాలను కోసిన పూలు, చిన్నచిన్న కుండీల్లో పెంచే చెట్ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా రవాణా అవుతున్నాయని, వీటివల్ల ప్రకృతికి హాని కలుగుతుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.ఇలా తరలివస్తున్న జీవులలో... షెఫీల్డ్‌లోని ఒక పూల దుకాణంలో గులాబీ పూల నుంచి బయటపడ్డ కప్ప, యూరప్ ప్రధాన భూభాగంలో అలంకరణకు ఉపయోగించే ఆలివ్ మొక్కలలో పాములు దొరికాయి.ఇలా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలివచ్చే జంతువులు, కీటకాలతో పంటలకు, గ్రామీణ ప్రాంతాల్లోని భూభాగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ పరిశోధకులు చెప్పారు.మొక్కలకు, దుంపలకు, పూలకు ప్రపంచ మార్కెట్లలో బాగా డిమాండ్ ఉన్న సమయంలో, రవాణా ప్రమాణాలను తక్షణం మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

"ఇలా తరలి వచ్చే జీవుల్లో పాములు, బల్లులు కేవలం చిన్న భాగం మాత్రమే" అని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విల్లియం సదర్లాండ్ చెప్పారు. ఇవే ఇలా ఒకదేశం నుంచి మరో దేశానికి రాగలుగుతున్నప్పుడు ఇక చిన్నచిన్న కీటకాలు, ఫంగీలను గుర్తించే అవకాశం ఎంత?- అవి నిజంగా సమస్యలకు కారణం కావా? అని ప్రశ్నించారు.భౌగోళికంగా ముఖ్యంగా తూర్పు ఆఫ్రికా, దక్షిణ అమెరికాలో అలంకరణ మొక్కల ఉత్పత్తి చాలా వేగంగా విస్తరించింది.చట్టాలు, సరిహద్దుల్లో తనిఖీలు ఉంటున్నప్పటికీ..పెద్ద ఎత్తున సాగే పూలు, అలంకరణ మొక్కల వాణిజ్యంతో దాని ద్వారా వచ్చే క్రిమి కీటకాలను, వ్యాధులను అడ్డుకోవడం చాలా కష్టమని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ సిల్వియు పెట్రోవాన్ చెప్పారు.

షెఫీల్డ్‌లో ఒక పూల దుకాణంలో బతికున్న కప్పను గుర్తించాలని ఒకసారి క్షీరదాల నిపుణుడిని పిలిచారు.ఆయన దాన్ని ప్రాంక్ అనుకున్నారు. కానీ, నిజంగానే ఈక్వెడార్ మీదుగా కొలంబియా నుంచి వచ్చిన గులాబీల్లో ట్రీ-ఫ్రాగ్ (ఎక్కువ కాలం చెట్లపై పెరిగే కప్ప)ను గుర్తించి తాను షాకైనట్లు సదరు నిపుణుడు తెలిపారు.బ్రిటన్‌లో కప్పలు, బల్లులు, క్రిమి కీటకాలు ప్రధానంగా ట్రాన్స్‌పోర్ట్ అవుతున్నాయి. యూరప్‌లో, ఎన్నో అరుదైన సరీసృపాలు, ఉభయచర జీవులు దొరుకుతున్నాయి.కుండీల్లో పెంచే ఆలివ్ మొక్కలలో గుర్తిస్తున్న జీవులు, జంతువులు.బల్లులు, యూరోపియన్ భూభాగంలో ఉండే పలు రకాల పాములు కప్పలు, కప్పలు మాదిరి ఉండే జీవులు పెద్ద సంఖ్యలో క్రిమి కీటకాలు అదొక అడవి దున్నల పుర్రెల పర్వతం, దాని వెనుక ఓ దారుణమైన కుట్ర కథ.

బయోసైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక రీసర్చ్ పేపర్‌లో, 2017-18 మధ్య కాలంలో నెదర్లాండ్స్‌లో కస్టమ్ అధికారుల తనిఖీల్లో అలంకరణ మొక్కల్లో దొరికిన కీటకాల రికార్డులను ఒక టీమ్ పరిశీలించింది.తమ పరిశీలనలను 2021-23లో యూకేలోని పర్యావరణం, ఆహారం, గ్రామీణ వ్యవహారాల విభాగానికి రిపోర్టు చేసింది.ఉత్పత్తి ప్రమాణాలను మెరుగుపర్చాలని, వాణిజ్యంలో ఉన్న నిర్దిష్ట ప్రమాదాల డేటాను సేకరించి,షేర్ చేయాలని వారు కోరారు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్

### ఈ ఒక్క ఏరియాలోనే ఇల్లు కావాలంటున్న కొనుగోలుదారులు



భాగ్యనగరంలో స్థిరాస్తి రంగం ఎప్పుడూ ఒక కొత్త మలుపు తీసుకుంటూనే ఉంటుంది. ఒకప్పుడు మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలు ఐటీ కంపెనీల రాకతో ఎలాగైతే ఊహించని రీతిలో అభివృద్ధి చెందాయో.. ఇప్పుడు సరిగ్గా అదే తరహా వృద్ధి ఉత్తర హైదరాబాద్‘ వైపు కనిపిస్తోంది. రియల్టీ నిపుణుల విశ్లేషణ ప్రకారం.. రాబోయే కొద్ది ఏళ్లలోనే ఈ ప్రాంతం గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ స్థాయికి చేరుకోనుంది.గతంలో ఐటీ రంగం కేవలం పశ్చిమ హైదరాబాద్‌కే పరిమితమై ఉండేది. అయితే, నగరం నలువైపులా ఐటీని విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కండ్లకోయలో భారీ ఐటీ పార్క్‌ను ఏర్పాటు చేస్తోంది. సుమారు 6 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ పార్క్.. విస్తీర్ణంలో ప్రఖ్యాత సైబర్ టవర్స్ కంటే పెద్దదిగా ఉండబోతోంది. భవిష్యత్తులో ఇక్కడ దాదాపు 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా. ఈ ప్రాజెక్టు ప్రకటనతోనే ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ఒక్కసారిగా పుంజుకుంది.ఉత్తర హైదరాబాద్ అభివృద్ధికి రవాణా సౌకర్యాలు వెన్నెముకగా నిలుస్తున్నాయి:రహదారులు: హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారి ఈ ప్రాంతం గుండా వెళుతుంది. రద్దీని తగ్గించేందుకు సుచిత్ర నుండి కొంపల్లి వరకు సుమారు 10 కి.మీ మేర మూడు ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు.రైల్వే & ఎంఎంటీఎస్: ముంబై, షిర్డీ వెళ్లే ప్రధాన రైలు మార్గంతో పాటు బొల్లారం, మేడ్చల్ వరకు ఎంఎంటీఎస్ సదుపాయం ఉండటం ఉద్యోగులకు వరం.ప్రాముఖ్యత: ఇక్కడ జీనోమ్ వ్యాలీ, నల్సార్ వంటి అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థలు ఇప్పటికే కొలువుదీరాయి. ఇతర హైవేలతో పోలిస్తే ఇక్కడ ట్రాఫిక్ తక్కువగా ఉండటం వల్ల 30 నిమిషాల్లోనే నగరం నడిబొడ్డుకు చేరుకోవచ్చు.హైదరాబాద్‌లో గుడ్డిగా ఇల్లు కొని మోసపోవద్దు.. అనుమతులపై తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన హైడ్రా.. హైదరాబాద్‌లో గుడ్డిగా ఇల్లు కొని మోసపోవద్దు.. అనుమతులపై తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన హైడ్రా..అందుబాటులో ధరలు మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలు ప్రస్తుతం ఖరీదైన పెట్టుబడి మార్కెట్లుగా మారాయి. సామాన్యులకు అక్కడ స్థలాలు కొనడం కష్టతరంగా మారింది. దీనికి భిన్నంగా ఉత్తర హైదరాబాద్‌లోని కొంపల్లి, మేడ్చల్ వైపు ధరలు అందుబాటులో ఉన్నాయి.అపార్ట్‌మెంట్లు: చదరపు అడుగుకు రూ.4,500 - రూ.5,000.గేటెడ్ కమ్యూనిటీ: చ.అ.కు రూ.5,500 - రూ.6,000.ఓపెన్ ప్లాట్లు: గజం ధర రూ.60,000 నుండి రూ.80,000 వరకు పలుకుతోంది.హాట్‌స్పాట్‌గా మారుతున్న ప్రాంతాలుప్రస్తుతం జీడిమెట్ల, దూలపల్లి, అల్వాల్, బొల్లారం, కొంపల్లి, కండ్లకోయ, శామీర్‌పేట మరియు మేడ్చల్ వంటి ప్రాంతాలు పెట్టుబడులకు కేంద్ర బిందువులుగా మారాయి. నిజామాబాద్, కామారెడ్డి వంటి ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన వారు కూడా ఇక్కడ భూములను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు ఇప్పటికే ఈ ప్రాంతంలో భారీ విల్లా ప్రాజెక్టులు, ఆకాశహర్మ్యాలను నిర్మించడానికి భూములను సేకరిస్తున్నాయి.ఏదేమైనా అభివృద్ధిని ముందుగానే ఊహించి పెట్టుబడి పెట్టే వారికి ఉత్తర హైదరాబాద్ ఒక బంగారు అవకాశంలా కనిపిస్తోంది. పశ్చిమ హైదరాబాద్‌తో పోలిస్తే ఇక్కడ తక్కువ ధరకే మెరుగైన జీవన ప్రమాణాలు కలిగిన ఇళ్లు లభించే అవకాశం ఉండటమే దీనికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు.డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

# భారత ఫారెక్స్ రిజ్వర్వులను దెబ్బతీసిన ఇరాన్ యుద్ధం

### భారీగా తగ్గిన బంగారం నిల్వలు..




పశ్చిమాసియాలో ముఖ్యంగా ఇరాన్ కేంద్రంగా సాగుతున్న యుద్ధం ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేస్తోంది. ముడి చమురు, సహజ వాయువు దిగుమతులపై అత్యధికంగా ఆధారపడే భారతదేశంపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. చమురు ధరల పెరుగుదల దేశీయంగా ద్రవ్యోల్బణాన్ని పెంచడమే కాకుండా.. భారత రూపాయి విలువపై, దేశ విదేశీ మారక నిల్వలపై ఊహించని ఒత్తిడిని తీసుకువచ్చింది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. కేవలం ఒక్క నెల వ్యవధిలోనే భారతదేశ విదేశీ మారక నిల్వలు 728 బిలియన్ డాలర్ల నుండి 688 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అంటే సుమారు 40 బిలియన్ డాలర్ల నిల్వలు హరించుకుపోయాయి. మార్చి 27, 2026తో ముగిసిన వారంలో దేశ మొత్తం నిల్వలు 10.288 బిలియన్ డాలర్లు తగ్గి 688.058 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీనికి ముందు వారంలో కూడా 11.413 బిలియన్ డాలర్ల తగ్గుదల నమోదు కావడం గమనార్హం. ఫిబ్రవరి 27, 2026 నాటికి 728.494 బిలియన్ డాలర్ల సర్వకాలిక గరిష్ఠ స్థాయిలో ఉన్న నిల్వలు.. యుద్ధం కారణంగా వరుసగా రెండు వారాల పాటు భారీ క్షీణతను చూశాయి.నిల్వల తగ్గుదలకు ప్రధాన కారణాలను చూసినట్లయితే.. భారత విదేశీ మారక నిల్వల్లోని వివిధ విభాగాలు ఈ కాలంలో ఒత్తిడికి లోనయ్యాయి. రిజర్వులలో అతిపెద్ద భాగమైన ఎఫ్.సి.ఏ 6.622 బిలియన్ డాలర్లు తగ్గి 551.072 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో ధరల హెచ్చుతగ్గుల వల్ల బంగారు నిల్వల విలువ కూడా వారం వ్యవధిలో 3.666 బిలియన్ డాలర్లు తగ్గి 113.521 బిలియన్ డాలర్లకు చేరింది. భారత కరెన్సీలో వీటి విలువ సుమారు ₹11.75 లక్షల కోట్లుగా ఉంది.ఇరాన్ యుద్ధంతో స్టాక్ మార్కెట్ కుదేల్.. ఆస్తులు కాపాడుకోవడానికి పెట్టుబడిదారులకు కీలక సూచనలు ఇవిగో..ఇరాన్ యుద్ధంతో స్టాక్ మార్కెట్ కుదేల్.. ఆస్తులు కాపాడుకోవడానికి పెట్టుబడిదారులకు కీలక సూచనలు ఇవిగో..యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు పెరగడంతో డాలర్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇది రూపాయి విలువను పాతాళానికి నెట్టే ప్రమాదం ఉండటంతో, రిజర్వ్ బ్యాంక్ రంగంలోకి దిగింది. రూపాయి పతనాన్ని అడ్డుకోవడానికి ఆర్‌బిఐ తన వద్ద ఉన్న డాలర్లను బహిరంగ మార్కెట్లో విక్రయించింది. ఈ వ్యూహాత్మక జోక్యం వల్లే తగ్గినప్పటికీ, రూపాయి విలువ స్థిరంగా ఉండగలిగింది. ఆర్‌బిఐ తీసుకున్న సత్వర చర్యల వల్ల రూపాయి రికార్డు స్థాయి నుండి తిరిగి కోలుకోవడం విశేషం.భారతదేశం తన చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల నుంచే పొందుతుంది. యుద్ధం వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడితే, దిగుమతి బిల్లు పెరిగి కరెంట్ అకౌంట్ లోటు హెచ్చయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం మన వద్ద ఉన్న రూ. 65 లక్షల కోట్ల విలువైన విదేశీ మారక నిల్వలు దేశానికి ఒక రక్షణ కవచంలా పనిచేస్తున్నప్పటికీ, యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే ఈ నిల్వలు మరింత తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.క్లుప్తంగా చెప్పాలంటే ఇరాన్ యుద్ధం కారణంగా ఏర్పడిన భౌగోళిక రాజకీయ అనిశ్చితి భారత ఆర్థిక పటిష్టతను పరీక్షిస్తోంది. ఆర్‌బిఐ తన వద్ద ఉన్న వనరులను సమర్థవంతంగా ఉపయోగిస్తూ రూపాయిని కాపాడుతున్నప్పటికీ, అంతర్జాతీయ పరిస్థితులు చక్కబడితేనే దేశ ఆర్థిక స్థితిగతులు తిరిగి గాడిలో పడే అవకాశం ఉంది.

# బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో మైండ్ బ్లోయింగ్ టెక్నాలజీ



మనుషులకు పనిలేకుండానే విమానాల కంట్రోల్! అనగానే మనకు గుర్తొచ్చేది ఐటీ హబ్ , ట్రాఫిక్. అయితే ఇప్పుడు బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం మరో అడుగు ముందుకేసి సరికొత్త టెక్నాలజీని పరిచయం చేసింది. విమానాశ్రయం లోపల విమానాలు, వాహనాలు తిరిగే చోట ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, పనులు వేగంగా అవ్వడానికి ఒక అదిరిపోయే డ్రైవెన్ స్మార్ట్ ఎయిర్‌సైడ్ సేఫ్టీ సిస్టమ్‌ను తీసుకొచ్చారు. ఏంటి ఈ కొత్త సిస్టమ్? సాధారణంగా ఎయిర్‌పోర్ట్ లోపల రన్‌వేకి దగ్గరగా ఉండే రోడ్లను ‘క్రాస్ సర్వీస్ రోడ్స్‘ అంటారు. ఇక్కడ విమానాలు వెళ్తుంటాయి, అదే సమయంలో విమానానికి అవసరమైన సామాగ్రిని తీసుకెళ్లే గ్రౌండ్ వాహనాలు కూడా తిరుగుతుంటాయి. ఇప్పటివరకు ఈ రెండింటి మధ్య సమన్వయం కోసం మనుషులు సిగ్నల్స్ ఇవ్వడమో లేదా మాన్యువల్‌గా లైట్లు ఆన్ చేయడమో చేసేవారు. దీనివల్ల చిన్న పొరపాటు జరిగినా పెద్ద ప్రమాదం అయ్యే అవకాశం ఉంటుంది. అందుకే బెంగళూరు ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్ ఇప్పుడు అంతా ఆటోమేటిక్ చేసేసింది.కెమెరాల నిఘా ఈ కొత్త సిస్టమ్‌లో భాగంగా ఎయిర్‌పోర్ట్ అంతటా హై-టెక్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవి కేవలం రికార్డ్ చేయడం మాత్రమే కాదు, అక్కడ ఏం జరుగుతుందో సెకన్ల వ్యవధిలో అర్థం చేసుకుంటాయి. ఏదైనా వాహనం విమానానికి అడ్డంగా వస్తున్నా, లేదా రూల్స్ అతిక్రమించినా ఈ కెమెరాలు వెంటనే గుర్తుపడతాయి. ముఖ్యంగా రాత్రిపూట లేదా మంచు కురిసే సమయంలో మనుషుల కళ్లకు సరిగ్గా కనిపించకపోయినా, ఈ కెమెరాలు మాత్రం పక్కాగా పనిచేస్తాయి. ఆటోమేటిక్ సిగ్నల్స్ సాధారణంగా ఎయిర్‌పోర్ట్ రన్‌వేల దగ్గర సర్వీస్ రోడ్ల మీద వాహనాల రాకపోకల వల్ల లేదా మాన్యువల్ సిగ్నలింగ్ ఆలస్యం వల్ల విమానాలు కాసేపు ఆగాల్సి వస్తుంది. కానీ ఈ కొత్త సిస్టమ్ వల్ల ఆ పనులన్నీ వేగంగా జరిగిపోతాయి. ఒక విమానం వెళ్తున్నప్పుడు రోడ్డు మీద ఉండే లైట్లు ఆటోమేటిక్‌గా మారిపోతాయి. వాహనాలు ఎక్కడ ఆగాలో, ఎప్పుడు వెళ్లాలో ఈ సిస్టమే నిర్ణయిస్తుంది. దీనివల్ల డ్రైవర్లు కన్ఫ్యూజ్ అయ్యే పని ఉండదు. విమానం వెళ్ళిపోయిన వెంటనే మళ్ళీ సిగ్నల్ క్లియర్ అయిపోతుంది. దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, విమానాలు త్వరగా టేకాఫ్ అవ్వడానికి, ల్యాండ్ అవ్వడానికి మార్గం సుగమం అవుతుంది. ప్రయాణికులకు లాభం ఏంటి? మీరు అనుకోవచ్చు, “ఇదంతా ఎయిర్‌పోర్ట్ లోపల కదా, మాకేంటి లాభం?“ అని. విమానాశ్రయం లోపల పనులు ఎంత వేగంగా జరిగితే, మీ విమానం అంత త్వరగా బయలుదేరుతుంది. అనవసరమైన ఆలస్యం తగ్గుతాయి. అలాగే భద్రత విషయంలో రాజీ లేకుండా ప్రయాణం చేయవచ్చు. భవిష్యత్తులో ఈ డేటాను ఉపయోగించి ఏ సమయంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది, దాన్ని ఎలా మేనేజ్ చేయాలి అనే విషయాలను కూడా బెంగళూరు ఎయిర్‌పోర్ట్ ప్లాన్ చేస్తోంది. మొత్తానికి టెక్నాలజీని వాడుకోవడంలో బెంగళూరు ఎయిర్‌పోర్ట్ దేశంలోనే టాప్‌లో నిలుస్తోంది. ఈ స్మార్ట్ సేఫ్టీ సిస్టమ్‌తో విమాన ప్రయాణం మరింత సురక్షితం కానుంది.

# జీతం పెరిగినా చేతికి వచ్చే డబ్బు తగ్గుతుందా





### కొత్త టాక్స్ రూల్స్‌లో అసలు ట్విస్ట్ ఇదే!

సాధారణంగా ఉద్యోగంలో జీతం పెరిగితే ఎవరైనా సంతోషిస్తారు. కానీ మన దేశంలోని కొత్త ఆదాయపు పన్ను విధానం ప్రకారం, కొన్నిసార్లు స్వల్పంగా పెరిగిన జీతం మీ జేబుకు చిల్లు పెట్టవచ్చు. అంటే, మీకు పెరిగిన జీతం కంటే మీరు కట్టే పన్ను ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. దీనినే ట్యాక్స్ పరిభాషలో ‘మార్జినల్ రిలీఫ్‘ సమస్య అంటారు. అసలు ఈ నిబంధన ఏమిటి? పెరిగిన జీతం వల్ల పన్ను భారం పెరగకుండా ఎలా జాగ్రత్త పడాలో ఇప్పుడు చూద్దాం.రెండు వేర్వేరు సందర్భాలు - షాకింగ్ నిజాలుఒక చిన్న ఉదాహరణతో దీనిని అర్థం చేసుకుందాం. కొత్త ట్యాక్స్ విధానంలో రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి రిబేట్ లభిస్తుంది.సందర్భం 1: ఒక వ్యక్తి వార్షిక ఆదాయం రూ.13.40 లక్షలు అనుకుందాం. స్టాండర్డ్ డిడక్షన్ రూ.75,000 పోగా, పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రూ.12.65 లక్షలు అవుతుంది. దీనిపై లెక్కల ప్రకారం రూ.69,750 పన్ను పడుతుంది. కానీ ఆదాయం రూ.12 లక్షల కంటే కేవలం రూ.65,000 మాత్రమే ఎక్కువగా ఉంది కాబట్టి, ప్రభుత్వం ‘మార్జినల్ రిలీఫ్‘ ఇచ్చి పన్నును రూ.65,000 కి తగ్గిస్తుంది.సందర్భం 2: ఇప్పుడు అదే వ్యక్తి జీతం రూ.13.50 లక్షలకు పెరిగింది అనుకుందాం (కేవలం రూ.10,000 పెంపు). ఇప్పుడు ట్యాక్సబుల్ ఇన్కమ్ రూ.12.75 లక్షలు అవుతుంది. దీనిపై పన్ను రూ.71,250 పడుతుంది. ఇక్కడ మార్జినల్ రిలీఫ్ వర్తించదు.అంటే.. కేవలం రూ.10,000 జీతం పెరగడం వల్ల, ఆ వ్యక్తి అదనంగా రూ.6,250 పన్ను కట్టాల్సి వస్తోంది. అంటే పెరిగిన జీతంలో 60 శాతం పైగా పన్ను రూపంలోనే పోతుందన్నమాట!మార్జినల్ రిలీఫ్ ఎందుకు ఇస్తారుఒక వ్యక్తి ఆదాయం రూ.12,00,000 ఉంటే పన్ను సున్నా. అదే రూ.12,01,000 ఉంటే వేలల్లో పన్ను కట్టాల్సి వస్తే అది అన్యాయం అవుతుంది. అందుకే, పెరిగిన ఆదాయం కంటే పన్ను ఎక్కువగా ఉండకూడదని ప్రభుత్వం ఈ ఉపశమనాన్ని ఇస్తుంది. అయితే, ఇది ఒక నిర్దిష్ట పరిమితి వరకు మాత్రమే పనిచేస్తుంది. ఆ పరిమితి దాటిన వెంటనే పూర్తి పన్ను భారం పడుతుంది.పన్ను భారం తగ్గించుకోవడానికి చిట్కాలుకొత్త లో ఉన్నవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ అదనపు భారం నుంచి తప్పించుకోవచ్చు..స్టాండర్డ్ డిడక్షన్ వాడకం: రూ.75,000 స్టాండర్డ్ డిడక్షన్‌ను సరిగ్గా ఉపయోగించుకుని మీ ట్యాక్సబుల్ ఆదాయాన్ని తగ్గించుకోండి.బోనస్ ప్లానింగ్: ఒకవేళ మీ ఆదాయం ట్యాక్స్ కి దగ్గరగా ఉంటే, బోనస్‌లు లేదా ఇతర వేరియబుల్ పేమెంట్లను తదుపరి ఆర్థిక సంవత్సరానికి వాయిదా వేయడం గురించి ఆలోచించండి.పాత వర్సెస్ కొత్త విధానం: మీ పెట్టుబడులు, మినహాయింపులను బట్టి పాత పన్ను విధానం మేలో లేక కొత్తదో ముందే లెక్కించుకోండి.స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్: ఆదాయం పెరిగినప్పుడు వచ్చే పన్ను చిక్కులను నివారించడానికి ట్యాక్స్ సేవింగ్ ఆప్షన్లను సరిగ్గా ఎంచుకోండి.జీతం పెరగడం ఎప్పుడూ శుభపరిణామమే, కానీ ఇలాంటి పన్ను మెలికలు తెలియనప్పుడు అది మనకు తెలియకుండానే ఆర్థిక నష్టాన్ని కలిగిస్తుంది. కాబట్టి, ట్యాక్స్ ప్లానింగ్ విషయంలో నిపుణుల సలహా తీసుకోవడం ఎప్పుడూ ఉత్తమం.

# జాబ్ పోయినా నాకు టెన్షన్ లేదు! ఎందుకంటే

### బెంగళూరు టెక్కీ వైరల్ పోస్ట్!




సాధారణంగా ఎవరికైనా ఉద్యోగం పోయిందంటే గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. కానీ, బెంగళూరుకు చెందిన ఒక ఐటీ ప్రొఫెషనల్ మాత్రం, “నా ఉద్యోగం పోయింది, నేను చాలా సంతోషంగా ఉన్నాను“ అంటూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా బెంగళూరు వంటి నగరాల్లో ఇల్లు కొనాలా? లేక అద్దెకు ఉండాలా? అనే సందిగ్ధంలో ఉన్నవారికి ఈయన అనుభవం ఒక పెద్ద కనువిప్పుగా మారింది. ఇంతకీ అసలేం జరిగిందంటే..ఈఎంఐ కంటే ఫ్లెక్సిబిలిటీ ముఖ్యం!ఆ టెక్కీ తన రెడ్డిట్ పోస్ట్ లో ఏం చెప్పాడంటే.. “గత ఏడాది నేను బెంగళూరులో ఒక 3 ఇల్లు కొనాలని వెతికాను. నా నెట్ వర్త్ చూసుకుంటే రూ. 2 కోట్ల విలువైన ఇంటిని సులభంగా కొనగలను. కానీ, నేను అప్పుడు మైగ్రేషన్ టీమ్ లో పని చేస్తున్నాను. రాబోయే 2 - 3 ఏళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఐటీ రంగంలో ఎలాంటి మార్పులు వస్తాయో నాకు ముందే తెలుసు. అందుకే ఆఫీస్ నుంచి గంట దూరం ప్రయాణం చేస్తూ భారీ ఈఎంఐలు కట్టడం కంటే, ఆఫీస్ దగ్గర్లోనే అద్దెకు ఉండాలని నిర్ణయించుకున్నాను. సరిగ్గా గత వారం నా ఉద్యోగం ఊడింది. ఇప్పుడు నా తలపై ఈఎంఐ ల భారం లేదు కాబట్టి, ప్రశాంతంగా నా తర్వాతి కెరీర్ గురించి ఆలోచించుకోగలుగుతున్నాను“ అని చెప్పుకొచ్చాడు.బెంగళూరు రియల్ ఎస్టేట్ బుడగ పేలుతుందాఈ పోస్ట్ పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. బెంగళూరులో 70-80 శాతం ఇళ్ల కొనుగోలుదారులు ఐటీ ఉద్యోగులే. సర్వీస్ బేస్డ్ కంపెనీల్లో ఉద్యోగ భద్రత తగ్గుతున్న ఈ తరుణంలో, భారీ అప్పులు చేసి ఇళ్లు కొనడం ఆత్మహత్యాసదృశ్యమని చాలామంది అభిప్రాయపడుతున్నారు. ఒక యూజర్ అయితే, “గ్లోబల్ యుద్ధాలు, ప్రభావం, మార్కెట్ లో పెరుగుతున్న ఇళ్ల సరఫరా చూస్తుంటే.. ఇప్పుడు కొనడం కంటే మరో రెండేళ్లు వేచి చూడటమే మంచిది“ అని కామెంట్ చేశారు. మరికొందరు బిల్డర్లు కావాలనే ‘స్టాక్ అయిపోయింది‘ అని అబద్ధాలు చెబుతూ ధరలను పెంచుతున్నారని ఆరోపించారు.నిపుణులు ఏమంటున్నారుఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం.. నగరాల్లో ఇల్లు కొనేవారు తమ ఆదాయంలో అధిక భాగం ఈఎంఐలకే కేటాయించడం వల్ల ఆర్థికంగా బలహీనపడుతున్నారు. ఉద్యోగం పోవడం లేదా అనారోగ్యం వంటి అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు, భారీ అప్పులు ఉన్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని హెచ్చరిస్తున్నారు. బెంగళూరు లోని మౌలిక సదుపాయాలు, నీటి సమస్యలు చూస్తుంటే, కోట్లాది రూపాయలు పెట్టి ఇల్లు కొనడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.మొత్తానికి ఆ టెక్కీ చెప్పినట్లుగా.. భవిష్యత్తు అస్పష్టంగా ఉన్నప్పుడు భారీ ఆర్థిక బాధ్యతలు నెత్తిన వేసుకోకుండా, ప్రశాంతంగా ఉండటమే ‘పీస్ ఆఫ్ మైండ్‘ అనిపిస్తోంది. ఈఎంఐ ల ఉచ్చులో పడకుండా ఉండటమే నేటి కాలంలో అసలైన సక్సెస్ అని ఐటీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ఫ్లైట్ టికెట్స్ బుక్ చేస్తున్నారా

### సీట్ సెలెక్షన్ రూల్‌పై కేంద్రం సరికొత్త నిర్ణయం!





విమాన ప్రయాణం చేసే వారికి కేంద్ర ప్రభుత్వం ఒక చేదు వార్త వినిపించింది. కేవలం మూడు వారాల క్రితం ప్రయాణికుల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన ఒక కీలక నిబంధనను ఇప్పుడు ప్రభుత్వం అకస్మాత్తుగా రద్దు చేసింది. విమానాల్లో కనీసం 60 శాతం సీట్లను ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా ప్రయాణికులకు కేటాయించాలని గత నెలలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.అసలు ఆ రూల్ ఏమిటి సాధారణంగా మనం ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసుకున్నప్పుడు, వెబ్ చెక్-ఇన్ సమయంలో నచ్చిన సీటును ఎంచుకోవాలంటే విమానయాన సంస్థలు అదనపు బాదుడు మొదలుపెడతాయి. కిటికీ పక్కన సీటు కావాలన్నా లేదా ముందు వరుసలో కూర్చోవాలన్నా భారీగా వసూలు చేస్తాయి. ప్రస్తుతం కేవలం 5 నుంచి 15 శాతం సీట్లు మాత్రమే ఉచితంగా అందుబాటులో ఉంటున్నాయి. దీనిని అరికట్టడానికి, ప్రతి విమానంలో 60 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని మార్చి 17న ప్రభుత్వం ఆదేశించింది. దీనివల్ల సామాన్య ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గుతుందని అందరూ భావించారు.వెనక్కి తగ్గడానికి కారణాలేంటిఈ నిబంధనను విమానయాన సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇండిగో, ఎయిర్ ఇండియా, స్పైస్‌జెట్ వంటి సంస్థలు ఉన్న ‘ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్లైన్స్‘ , ఆకాశ ఎయిర్ ప్రభుత్వానికి లేఖలు రాశాయి. సీట్ సెలెక్షన్ ఫీజును రద్దు చేస్తే, ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి బేస్ ఫ్లైట్ టికెట్ ధరలను పెంచాల్సి వస్తుందని వారు వాదించారు. విమాన ఇంధన ధరలు పెరగడం, అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల విమాన రంగం ఇప్పటికే ఇబ్బందుల్లో ఉందని, ఇలాంటి నిర్ణయాలు మరింత భారం వేస్తాయని వారు వివరించారు. ఈ విజ్ఞప్తులను పరిశీలించిన ప్రభుత్వం, ప్రస్తుతానికి ఈ ఉత్తర్వులను పక్కన పెడుతున్నట్లు స్పష్టం చేసింది.ప్రయాణికులకు ఊరటనిచ్చే అంశాలుఅయితే, 60 శాతం ఉచిత సీట్ల నిబంధనను రద్దు చేసినప్పటికీ, మార్చి 17 నాటి సర్క్యులర్‌లోని ఇతర అంశాలను మాత్రం ప్రభుత్వం కొనసాగిస్తోంది.కలిసి ప్రయాణించే వారికి ప్రాధాన్యత: ఒకే టికెట్ పై బుక్ చేసుకున్న కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు వీలైనంత వరకు పక్కపక్క సీట్లు కేటాయించాలని ఆదేశించింది.పారదర్శకత: క్రీడా సామాగ్రి, సంగీత పరికరాలు , పెంపుడు జంతువులను తీసుకెళ్లే విషయంలో స్పష్టమైన పాలసీలు ఉండాలని స్పష్టం చేసింది.ఛార్జీల వెల్లడి: సీట్ల కోసం వసూలు చేసే అదనపు ఛార్జీల వివరాలను బుకింగ్ సమయంలోనే స్పష్టంగా చూపాలని డిజిసిఎ ను కోరింది.మొత్తానికి విమాన ప్రయాణం చౌకగా మారుతుందని ఆశించిన సామాన్యులకు ఈ నిర్ణయం నిరాశ కలిగించే విషయమే. అయితే విమాన సంస్థల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ మధ్యేమార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది.

# 'తండ్రి లాంటి వ్యక్తిని కోల్పోయా' మోహన్ బాబు ఎమోషనల్




టాలీవుడ్ నటుడు, హీరో మోహన్ బాబు ప్రస్తుతం నాని హీరోగా వస్తోన్న ది ప్యారడైజ్ మూవీలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో విలన్ పాత్రలో అభిమానులను మెప్పించనున్నారు. ఇటీవలే మోహన్ బాబు క్యారెక్టర్ సంబంధించిన గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఇందులో మోహన్ బాబు లుక్ అదిరిపోయింది. దాదాపు 32 ఏళ్ల తర్వాత విలన్ పాత్రలో కనిపించనుండడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమా ఆగస్టు 21 ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా సంగతి పక్కనపెడితే మోహన్ బాబు డైరెక్టర్స్ డే 2026 ఈవెంట్‌కు హాజరయ్యారు. దివంగత దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ బాబు ఆసక్తికర కామెంట్స్ చేశారు. దాసరి నారాయణరావును తలచుకుని ఎమోషనలయ్యారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన బర్త్ డేను మనం సెలబ్రేట్ చేసుకున్నప్పటికీ.. చాలా బాధకరమైన రోజేనని అన్నారు. తండ్రి లాంటి వ్యక్తిని నేను కోల్పోయాననే బాధ నాకు జీవితమంతా ఉంటుందని తెలిపారు. ఎక్కడో ఉన్న నన్ను ఇండస్ట్రీకి తీసుకువచ్చి మోహన్‌బాబుగా ఈ స్థాయికి తీసుకొచ్చారని భావోద్వేగానికి గురయ్యారు. ఈ జనరేషన్ వాళ్లకు చాలామందికి డైరెక్టర్ అనే పదానికి అర్థం తెలియదు.. దర్శకుడు అనే పదానికి సరైన అర్థం చెప్పిన ఏకైక వ్యక్తి దాసరి నారాయణరావుగారే అన్నారు.

# క్రిస్టోఫర్ నోలన్ 'ద ఒడిస్సీ' తెలుగు ట్రైలర్



క్రిస్టోఫర్ నోలన్ పేరు చెబితే మూవీ లవర్స్ ఎగ్జైట్ అయిపోతారు. ఎందుకంటే ఈ దర్శకుడు తీసే సినిమాలకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. ఒక పట్టానా అర్థం కావనే కామెంట్స్ వినిపిస్తాయి గానీ సూపర్ హిట్ అవడంతో పాటు వేల కోట్ల కలెక్షన్స్ గ్యారంటీ. ఈయన చేసిన లేటెస్ట్ మూవీ 'ద ఒడిస్సీ'. జూలై 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే తాజాగా తెలుగు ట్రైలర్ కొత్తది రిలీజ్ చేశారు. ఇది విజువల్ వండర్‌లా ఉంటూ మూవీపై హైప్ పెంచుతోంది. ఒడియన్ అనే రాజు జీవితం ఆధారంగా ఈ సినిమా తీశారు. ఇందులో ఒడియన్ పాత్రలో మ్యాట్ డామన్, పెనెలోపీగా అన్నా హాత్వే, టెలిమాకస్‌గా టామ్ హోలండ్ కనిపించనున్నారు. రాబర్ట్ ప్యాటిన్‌సన్, ఛార్లెజ్ థెరోన్ కూడా కీలక పాత్రలు చేశారు. ఇంగ్లీష్‌తో పాటు భారతీయ భాషల్లోనూ ఈ మూవీని డబ్బింగ్ చేసి రిలీజ్ చేయబోతున్నారు. పూర్తిగా ఐమ్యాక్స్ కెమెరాలతో మొత్తం షూటింగ్ పూర్తి చేయడం విశేషం. ట్రైలర్ బట్టి చూస్తే ఒడియన్ అనే రాజు, ఓ యుద్ధంలో పాల్గొనేందుకు తన రాజ్యాన్ని, భార్య కొడుకుని వదిలి మరో చోటకు వెళ్తాడు. యుద్ధం గెలిచి తిరిగొస్తుంటే సముద్రంలో ఇతడి సైన్యం ప్రయాణిస్తున్న ఓడ ప్రమాదానికి గురవుతుంది. కానీ ఒడియన్ రాజు ప్రాణాలు దక్కించుకుంటాడు. తర్వాత ఏమైంది? భార్య-కొడుకుని కలిశాడా అనేది మిగతా స్టోరీ. ప్రాచీన కవి హోమర్ రాసిన 'ద ఒడిస్సీ' పుస్తకం ఆధారంగా ఈ సినిమాని తెరకెక్కించారు.



# 'జన నాయగన్'కి శాపమే వరమైంది.. కనక వర్షం గ్యారెంటీ!

ఏది జరిగినా మన మంచికే అనుకునే మనసు ఉంటే...ప్రతి కష్టం ఒక పాఠం అవుతుంది... ప్రతి ఓటమి ఒక అవకాశంగా మారుతుంది. ఇప్పుడు దళపతి విజయ్ విషయంలో ఇదే జరిగింది. ఎన్నికల ముందు ఆయనకు వరుస ఇబ్బందులు ఎదురయ్యాయి. భార్య సంగీతతో విడాకులు వివాదం.. మరోవైపు ప్రచారంలో తొక్కిసలాటలు, ఇంకోవైపు తన చివరి చిత్రం విడుదల వాయిదా పడడం.. ఇవన్నీ తట్టుకొని అలుపెరగకుండా ప్రచారం చేసి.. చివరకు రాజకీయ ప్రభంజనం సృష్టించాడు. తమిళనాడు రాష్ట్రానికి ఆయన సీఎం అయ్యే అవకాశముంది. ఒకవేళ అదే జరిగితే ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత విడుదలవుతున్న ఏకైక సినిమా 'జన నాయగన్' కాబట్టి.. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురవడం కూడా ఖాయమే.

**ఆలస్యమే అమృతం..**

ఆలస్యం అయితే అమృతం కూడా విషం అవుతుందంటారు. నిజమే కానీ 'జన నాయగన్' విషయంలో మాత్రం ఆలస్యమే అమృతం అయ్యేలా ఉంది. ఈ ఏడాది సంక్రాంతికి ఈ సినిమా విడుదల కావాల్సింది. కానీ పలు కారణాలతో వాయిదా పడింది. ఎన్నికల ముందు రిలీజ్ అయితే.. కొంతవరకు పొలిటికల్ కెరీర్‌కి కూడా ప్లస్ అవుతుందని విజయ్ భావించాడు. కానీ అది జరగలేదు. వాయిదా పడడమే కాదు.. అందులోని కొన్ని సన్నివేశాలు కూడా లీకయ్యాయి. ఓటీటీ బిజినెస్ కూడా చేజారిపోయింది. ఇక జన నాయగన్ రిలీజ్ అవుతుందో లేదో అని చాలా మంది అనుకున్నారు. కానీ నిన్నటి ఫలితాలు అందరి అంచనాలను తలకిందులు చేసింది. 108 స్థానాల్లో టీవీకే పార్టీ గెలిచి.. ప్రభుత్వ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోంది. విజయ్ సీఎం అయిన తర్వాత జననాయగన్ విడుదల అవ్వడం ఖాయం. అప్పుడు ఈ సినిమాకు వచ్చే హైప్, క్రేజ్ వేరే లెవెల్ ఉంటుంది.

# ఎట్టకేలకు శుభవార్త చెప్పిన పటాస్ ప్రవీణ్



తెలుగులో రియాలిటీ షోలతో చాలాజంటలు పాపులారిటీ సంపాదించాయి. అలాంటి వాటిలో ప్రవీణ్-ఫైమా జోడీ ఒకటి. కలిసి స్కిట్స్ చేశారు. యూట్యూబ్ వ్లాగ్స్ కూడా చేశారు. ఒకరిపై ఒకరు ప్రేమ చూపించారు. దీంతో వీళ్లిద్దరూ ప్రేమలో ఉన్నారు. త్వరలో పెళ్లి చేసుకుంటారేమో అని అంతా అనుకున్నారు. కానీ ఫైమా తన జీవితంలో ప్రవీణ్ అనే మరో వ్యక్తి ఉన్నాడని అతడే తన ప్రియుడి అని సోషల్ మీడియాలో వెల్లడించింది. ఫైమాతో కలిసి నటించిన ప్రవీణ్ విషయానికొస్తే ఇప్పుడు మరో నటితో నిశ్చితార్థం చేసుకుని షాకిచ్చాడు. పలు ఆల్బమ్ సాంగ్స్‌లో చేసిన వంశిత అనే అమ్మాయితో పటాస్ ప్రవీణ్ ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలని తన సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేశాడు. దీంతో తోటి కమెడియన్స్ కొత్త జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. త్వరలో పెళ్లి వార్త కూడా చెప్పే అవకాశముంది. ప్రవీణ్ పెళ్లి చేసుకోబోతున్న వంశిత.. బంధువుల అమ్మాయి అని అంటున్నారు. పటాస్ ప్రవీణ్ విషయానికొస్తే చిన్నప్పుడే తల్లిని కోల్పోయాడు. నాలుగేళ్ల క్రితం బ్రెయిన్ ట్యూమర్‌తో తండ్రి కూడా చనిపోయాడు. ఇతడికి ఓ అన్న ఉన్నాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోబోతున్నాడు.

# 'టాక్సిక్'లో బోల్డ్ సీన్స్ వివాదం కియారా అద్వానీ క్లారిటీతో పుకార్లకు చెక్



కన్నడ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా 'టాక్సిక్' చుట్టూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీ పాత్రకు సంబంధించిన బోల్డ్ సన్నివేశాలపై వచ్చిన వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. సినిమాలో తనపై చిత్రీకరించిన కొన్ని హాట్ సీన్స్‌ను తొలగించమని లేదా మార్చాలని కియారా మేకర్స్‌ను కోరిందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. టీజర్‌లో కనిపించిన గ్లామరస్ విజువల్స్ కారణంగా ఈ వార్తలకు మరింత ఊపు వచ్చింది. దీంతో సినిమాలో ఘాటైన సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయన్న అంచనాలు ప్రేక్షకుల్లో పెరిగాయి. అయితే ఈ మొత్తం ప్రచారంపై కియారా అద్వానీ స్వయంగా స్పందిస్తూ స్పష్టమైన క్లారిటీ ఇచ్చింది. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించిన ఆమె.. "నేను ఎలాంటి సన్నివేశాల విషయంలోనూ మార్పులు కోరలేదు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమైన పుకార్లే" అని పేర్కొంది. దీంతో ఈ వివాదానికి పూర్తిగా తెరపడినట్లైంది. ఈ చిత్రం టీజర్ విడుదలైనప్పటి నుంచి కియారా పాత్ర చుట్టూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆమె లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు, సినిమా కథపై కూడా ఆసక్తిని పెంచింది. అయితే అధికారిక సమాచారం లేకుండానే పుట్టుకొచ్చిన ఊహాగానాలు ఒక్కసారిగా వైరల్ కావడం ఈ ఘటన ద్వారా మరోసారి స్పష్టమైంది. ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. యష్ -- కియారా కాంబినేషన్ కూడా సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది. మొదట ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది. ప్రస్తుతం కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం. అభిమానులు ఈ అప్డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సోషల్ మీడియా యుగంలో ధృవీకరించని వార్తలు ఎంత వేగంగా వ్యాప్తి చెందుతాయో 'టాక్సిక్' వివాదం మరోసారి నిరూపించింది. అధికారిక ప్రకటనలు లేకుండా వచ్చే వార్తలను నమ్మడంలో జాగ్రత్త అవసరమని ఈ సంఘటన సూచిస్తోంది .

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.